




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 346 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 24 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-


## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

# 2 డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది. రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

## ఇది ఎల్ నినో కాదు..

# కాంగ్-నినో

### రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్..




- రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్
- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్

2

## తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్...

# జూరాలకు నీటి విడుదలకు ఓకే

- జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం
- విడతల వారీగా 3 TMCలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత
- బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ

2



## గణేశ్ నిమజ్జనం

### 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు



- గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25న జీహెచ్‌ఎంసీ పరిధిలో సెలవు
- ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక నిఘా
- నిమజ్జనం రోజు నగరంలోకి ప్రైవేట్ బస్సులు, లారీలకు అనుమతి నో

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్‌ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. మొత్తం 28,400 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు. ఈ నెల ....

2

## కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు?

# క్లారిటీ ఇచ్చిన అధికారులు..!

- ‘సర్’ సహా అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకున్నామన్న ఈసీ
- ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు చెప్పారన్న వార్తలను ఖండించిన అధికారులు




- కొన్ని అంశాలపై వారు పరిశీలనలు మాత్రమే చేశారని వెల్లడి
- ఓటర్ల జాబితా కచ్చితత్వమే ‘సర్’ లక్ష్యమని స్పష్టీకరణ

2

## 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు

### కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

- ఏపీ బీజేపీ ఇంచార్జ్‌గా అర్వింద్ భదౌరియా
- తెలంగాణ ఇంచార్జ్‌గా సునీల్ భన్సల్
- ఒడిశా ఇంచార్జ్‌గా పురందేశ్వరి

2




## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్..

# ఊడిపడిన ప్లాస్టరింగ్

- హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం
- లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం
- మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి
- శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రక్తపాతం..

### - ఐక్యరాజ్యసమితిలో కశ్మీరీ మహిళ ఘాటు విమర్శ

- పీఓకేలో జరుగుతున్న దారుణాలను ఐరాసలో నిలదీసిన బారాముల్లా యువతి తస్లీమా
- పాక్ భద్రతా బలగాలు క్రూరమైన అణచివేతకు పాల్పడుతున్నాయని ఆరోపణ



**నేటి శుభోదయ, డెస్క్ :** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై బారాముల్లాకు చెందిన యువ కార్యకర్త తస్లీమా అఖ్తర్ ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిలో నిలదీశారు. జెనీవాలో జరుగుతున్న 63వ సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఓకేలో పాలన, ఆర్థిక సమస్యలపై జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ, పౌర సమాజ సంస్థల నేతృత్వంలో శాంతియుత నిరసనలు జరుగుతున్నాయని... వాటిపై పాక్ భద్రతా దళాలు క్రూరమైన అణచివేతకు ...

2

# గణేశ్ నిమజ్జనం.. 25న సెలవు

## వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు

**మొదటిపేజీ తరువాయి..** 25న నిమజ్జనం ఉండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**నిమజ్జన ఏర్పాట్లపై సజ్జనార్**

నిమజ్జన ఏర్పాట్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగర పరిధిలో 20,000 మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నిఘా కోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, 24 డ్రోన్లు, 10,000 సీసీటీవీ కెమెరాల ద్వారా నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 100 హై-రైజ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల కట్టడికి 25 క్రైమ్ బ్రాంచ్ బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు. మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్' నిఘాను ముమ్మరం చేశామని, ఊరేగింపుల్లో డీజేలు వినియోగం, మండపాల వద్ద అసభ్యకర పాటలు, నృత్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో పాత వీడియోలు లేదా తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శన గడువు నేటి (బుధవారం) అర్ధరాత్రితో ముగియనుంది. నిమజ్జనం రోజున నగరంలోకి ప్రైవేట్ బస్సులు, భారీ ట్రక్కుల ప్రవేశానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రక్తపాతం..

## ఐక్యరాజ్యసమితిలో కశ్మీరీ మహిళ ఘాటు విమర్శ

**మొదటిపేజీ తరువాయి..** పాల్పడుతున్నాయని తస్లీమా అఖ్తర్ ఆరోపించారు. వందలాది మంది కార్యకర్తలను అరెస్టు చేయడం, నాయకులను నిర్బంధించడం, ఇంటర్నెట్ నిలిపివేయడం, హింసాత్మక ఘర్షణల్లో డజన్ల కొద్దీ మంది ప్రాణాలు కోల్పోవడం జరిగిందని ఆమె చెప్పారు. "పీఓకేలో పౌర స్వేచ్ఛ లేదు. నిరపరాధులపై పాక్ దళాలు జరుపుతున్న హత్యలను వెంటనే ఆపాలి. ప్రతి హత్యకు స్వతంత్ర విచారణ జరపాలి. సమాచారం, కమ్యూనికేషన్‌లను పునరుద్ధరించాలి" అని ఆమె డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆఫ్ టెర్రర్ విక్టిమ్స్ ఇన్ కశ్మీర్ (ఏటీవీకే)కి చెందిన ఈ కార్యకర్త, జమ్మూకశ్మీర్‌లో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్మార్ట్ సిటీలు, గ్రామీణ మౌలిక సదుపాయాల ద్వారా అభివృద్ధి జరుగుతోందని ప్రశంసించారు.

# తిరుమలలో వైభవంగా చక్రస్నానం.. ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



**నేటి శుభోదయ, తిరుమల :** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు బుధవారం నాడు చక్రస్నానంతో కన్నుల పండువగా ముగిశాయి. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ ఉత్సవాల చివరి రోజున స్వామి పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఘట్టంతో బ్రహ్మోత్సవాలకు పరిసమాప్తి పలికారు. అంతకుముందు, ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారికి సర్వభూపాల పల్లకి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శ్రీ భూవరాహ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వార్‌కు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో శంఖులు, కలశాల ద్వారా అభిషేకం చేశారు. ఈ సమయంలో వేద పండితులు ఉపనిషత్తులు, పంచ సూక్తాలు (పురుష, శ్రీ, భూ, నీలా, విష్ణు) పఠించగా, జీయర్ స్వాముల సమక్షంలో దివ్య ప్రబంధ పారాయణం నిర్వహించారు. అభిషేకం అనంతరం, సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా స్వామి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి, వేదమంత్రాల ఘోష నడుమ పవిత్ర జలాల్లో స్నానం చేయించారు. అదే శుభ సమయంలో, "గోవిందా... గోవిందా..." అంటూ భక్తి పారవశ్యంతో నామస్మరణ చేస్తూ, పుష్కరిణి వద్ద వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సుదర్శన చక్రం స్పృశించిన జలాల్లో స్నానం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆగమశాస్త్రం ప్రకారం, బ్రహ్మోత్సవాలను ఒక మహాయజ్ఞంగా పరిగణిస్తారు. ఉత్సవాల నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు జరిగితే, ఈ చక్రస్నానం (అవభృథ స్నానం) ద్వారా అవి తొలగిపోయి, భక్తులకు, లోకానికి సంపూర్ణ ఫలం, శాంతి, శ్రేయస్సు కలుగుతాయని నమ్మకం.

# ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో

## - రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కేంద్ర ఎన్నికల సంఘంలో విభేదాలు?

## - క్లారిటీ ఇచ్చిన అధికారులు..!

**మొదటిపేజీ తరువాయి..** ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) సహా ఎన్నికల సంఘం తీసుకున్న అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్లు పలు నిర్ణయాలపై రికార్డులో అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన వార్తలను తోసిపుచ్చింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై తమ అభిప్రాయాలను మాత్రమే వెల్లడించారని, వాటిని కమిషన్ పరిశీలించిందని పేర్కొంది. ఇటీవల 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం.. గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొంది. తమకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, ఓటర్ల పేర్ల చేర్పు, తొలగింపు వంటి అంశాలపై వారు అభ్యంతరాలు తెలిపినట్లు కథనం పేర్కొంది. ఎన్నికల సంఘం మాత్రం ఈ వాదనలను ఖండించింది. ఈసీ వర్గాల ప్రకారం.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే నిర్ణయాలు తీసుకున్నారు. కమిషన్ తీసుకున్న నిర్ణయాలపై ముగ్గురి సంతకాలు ఉంటాయని తెలిపింది. కమిషనర్ల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే మెజారిటీ నిర్ణయం అమల్లోకి వస్తుందని నిబంధనలు చెబుతున్నాయి. అయితే 'సర్' సహా అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని ఈసీ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈసీ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'సర్' వల్ల కొందరి ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యే అవకాశం ఉందంటూ ప్రతిపక్ష నేతలు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితా కచ్చితత్వం, సమగ్రతను నిర్ధారించేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ చెబుతోంది.

# 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత రాష్ట్రాలకు

## కొత్త ఇంచార్జ్‌లను నియమించిన బీజేపీ అధిష్ఠానం

**మొదటిపేజీ తరువాయి..**
రాబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికల్లో విజయమే ఏకైక లక్ష్యంగా బీజేపీ అధినాయకత్వం పార్టీ సంస్థాగత యంత్రాంగాన్ని భారీగా ప్రక్షాళన చేసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలకు కొత్త ఇంచార్జ్‌లు, సహ-ఇంచార్జ్‌ల జాబితాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అధికారికంగా ప్రకటించారు. ప్రాంతీయ రాజకీయ సమీకరణలు, ఎన్నికల వ్యూహాలను ప్రామాణికంగా తీసుకుని కీలక నేతలకు ఈ బాధ్యతలు కట్టబెట్టారు.

**తెలంగాణ:** సునీల్ భన్సల్ ఇంచార్జ్‌గా వ్యవహరించనుండగా, అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ-ఇంచార్జ్‌లుగా నియమితులయ్యారు. (సునీల్ భన్సల్ పశ్చిమ బెంగాల్ ఇంచార్జ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు).

**ఆంధ్రప్రదేశ్:** అర్వింద్ భదౌరియా ఇంచార్జ్‌గా, తమిళనాడు మాజీ ఎమ్మెల్యే వనతి శ్రీనివాసన్ సహ-ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు.

**తమిళనాడు:** రామ్ మాధవ్ ఇంచార్జ్‌గా ఎంపికవ్వగా, కో-ఇంచార్జ్‌లుగా డీకే అరుణ, నిర్మల్ కుమార్ సురాణా బాధ్యతలు చేపట్టనున్నారు.

**ఒడిశా:** దగ్గుబాటి పురందేశ్వరి ఇంచార్జ్‌గా, డాక్టర్ స్వదేశ్ సింగ్ సహ-ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

**కర్ణాటక:** హరీశ్ ద్వివేది ఇంచార్జ్‌గా... తెలంగాణకు చెందిన డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు సహ-ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు.

**ఉత్తర ప్రదేశ్:** దేశ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న యూపీకి జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే ఇంచార్జ్‌గా ఎంపికయ్యారు. ఆయనకు తోడుగా నలుగురు సహ-ఇంచార్జ్‌లను కేటాయించారు.

**మహారాష్ట్ర:** బైజయంత్ జయ్ పాండా ఇంచార్జ్‌గా వ్యవహరిస్తారు. ఆయనకు సహాయంగా అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్‌లను సహ-ఇంచార్జ్‌లుగా నియమించారు.

**ఛత్తీస్‌గఢ్ – హర్యానా:** మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి ఈ రెండు రాష్ట్రాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించారు.

**ఢిల్లీ:** డాక్టర్ వినయ్ సహస్రబుద్ధే ఇంచార్జ్‌గా, జాంయాంగ్ త్సేరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్‌లను కో-ఇంచార్జ్‌లుగా నియమించారు.

**గుజరాత్:** తరుణ్ చుగ్ ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

**హిమాచల్ ప్రదేశ్:** శ్రీకాంత్ శర్మ ఇంచార్జ్‌గా వ్యవహరించనున్నారు.

**మధ్యప్రదేశ్:** మాజీ సీఎం బిప్లబ్ కుమార్ దేవ్ ఇంచార్జ్‌గా నియమితులయ్యారు.

# తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్...

## - జూరాలకు నీటి విడుదలకు ఓకే

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- అర్హులందరికీ, పక్కా ఇళ్లు అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి
- భద్రాచలంలోని అంబ సత్రం మార్గంలో నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారుకు బట్టలు పెట్టిన శీనన్న

**ఖమ్మం, భద్రాచలం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** పేద, మధ్యతరగతి కుటుంబాల్లో సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అర్హులైన పేదలందరికీ మూడో విడతలో, అవసరమైతే నాలుగో విడతలోనూ ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు.భద్రాచలంలోని అంబ సత్రం సమీపంలోని కాలనీలో లబ్దిదారు మామిడి మౌనిక నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉదయం ప్రారంభించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌లతో కలిసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులకు మంత్రి నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేద, మధ్యతరగతి అక్కాచెల్లెళ్ల కుటుంబాల్లో సొంతింటి కలను నిజం చేసి, వారి జీవితాల్లో ఆనందం నింపాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవీప్రసన్న, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# దసరా కు సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ : నూతి

- ర్షం వ్యక్తం చేసిన సత్యనారాయణ

**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** రానున్న దసరా పండుగను పురస్కరించుకొని తెలంగాణలోని అర్హులైన ప్రజలకు అక్టోబర్ నెల నుంచి కొత్త సామాజిక భద్రతా పింఛన్లు (ఫెన్షన్లు) పంపిణీ చేయాలని మన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేసిన జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. బుధవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజల ముఖాల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా పనిచేస్తున్నదని చెప్పడానికి గర్వపడుతున్నానని, ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలనే సంకల్పంతో ప్రజాపాలన గావిస్తున్న ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే రాబోయే దసరా పండుగను పురస్కరించుకొని రాష్ట్రంలో కొత్తగా లక్షలాది మంది అర్హులైన ప్రజలకు అక్టోబర్ నెల నుంచే కొత్త పెన్షన్ల పంపిణీని ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దనసరి సీతక్క,పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు, సహచర మంత్రి వర్గ సభ్యులు తీసుకొన్న నిర్ణయం అత్యంత అభినందనీయమని ఖమ్మం జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపినజిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి వేచి చూసిన నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల కష్టాలను గుర్తించి వారికి దసరా పండుగ కానుకగా వారి చేతికి పెన్షన్ సొమ్ము అందే విధంగా అధికారులు రాత్రింబగుళ్ళు శ్రమిస్తున్నారని, లబ్దిదారుల వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పండుగ లోపే అర్హులందరికి ఈ ఆర్థిక భరోసా కల్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన మన ప్రజా ప్రభుత్వ అనుకూల విధానానికి నిదర్శనం అని పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడటమే కాంగ్రెస్ మార్క్ పాలన. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేరుస్తూ మన ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదల పక్షపాతి అని నిరూపిస్తూ పండుగ వేళ లబ్దిదారుల ఇళ్లల్లో వెలుగులు నింపబోతున్నందుకు మరొక్కసారి మన ప్రజా ప్రభుత్వానికి అభినందనలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్య



నారాయణ గౌడ్.అదే విదంగా మొన్నతిరుమలాయపాలెం మండలంలో వినాయక మండపాలలో పూజలు నిర్వహించి అన్నధాన కార్యక్రమాలలో పాల్గొని ఖమ్మం కు తిరుగు ప్రయాణమైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి కారు పై బీ ఆర్ యస్ నాయకులు చేసిన రాళ్ళ దాడిపై తీవ్రంగా మండిపడ్డారు. బీ ఆర్ యస్ నాయకులు చిల్లర వేషాలు మానుకోవాలని హితవు పలికారు. మరల ఇటువంటి ఆకాతాయి చేష్టలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలుంటాయాని హెచ్చరించారు. అదే విధంగా పోలీస్ అధికారులు దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పత్రికా ముఖంగా కోరిన జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

# సేవామూర్తి మెడలో మరో మణిహారం

- నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డుకు కడవెండి శ్రీనివాస్ ఎంపిక
- మూడు దశాబ్దాల నిస్వార్థ సేవలకు దక్కిన అరుదైన గుర్తింపు

**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** సమాజ సేవే ధ్యేయంగా మూడు దశాబ్దాలకు పైగా నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాల్లో ముందుండి, నిస్వార్థంగా సేవలందిస్తున్న కడవెండి శ్రీనివాస్ కు ప్రతిష్టాత్మకమైన నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు లభించడం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.సమాజానికి తన వంతు బాధ్యతగా భావించి ఎన్నో సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న కడవెండి శ్రీనివాస్ సేవలను గుర్తించిన ఎన్ ఎం ఐ ఫౌండేషన్, నోయిడా, ఉత్తరప్రదేశ్ సంస్థ ఆయనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డు ఆయన సేవా ప్రస్థానానికి లభించిన అరుదైన గౌరవంగా పలువురు అభివర్ణించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొదుమూరి జగన్నాథం మాట్లాడుతూ కడవెండి శ్రీనివాస్‌కు నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. “సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వ్యక్తికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం గర్వకారణం. సేవామూర్తి మెడలో మరో మణిహారం చేరింది” అని అన్నారు.కడవెండి శ్రీనివాస్ విసి ఐ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ గా, వి ఎన్ డైమండ్ కేసిజిఎఫ్ శ్రేయోభిలాషిగా పలు సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలను ఆశించకుండా సమాజ సేవకు అంకితమై పనిచేయడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు.“జేజేలు కడవెండి శ్రీనివాస్” అంటూ పలువురు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ఆయనకు మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ కడవెండి విశ్వనాథం, రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు, తేలుకుంట



ధనంజయ, తేలుకుంట్ల ఓంకార్, చలవారి శ్రీనివాసరావు, సుగ్గల శ్రీహరి, మారేమళ్ళ రామకృష్ణ, కురివెళ్ల గోపాలకృష్ణ, దోకుపర్తి నాగేశ్వరరావు, పెనుగొండ సూర్యప్రకాష్ తదితరులు కడవెండి శ్రీనివాస్‌కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. మూడు దశాబ్దాల సేవకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కడం కడవెండి శ్రీనివాస్ సేవా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచిందనీ వారు పేర్కొన్నారు.

# 26న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి : జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి

**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 26 న వీరనారీ చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 26న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసి అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు : జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జ్యోతి

**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** సెప్టెంబర్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద జయంతి వేడుకలు సెప్టెంబర్ 27న ఉదయం 9 గంటలకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీసి అభివృద్ధి అధికారిణి జ్యోతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కోర్టుకు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్, ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** తెలంగాణా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నాంపల్లిలోని ప్రజా ప్రతినిధుల మనోరంజన్ కోర్టుకు హాజరయ్యారు. 2022 జనవరి 4వ తేదీన కొత్తగూడెం జిఆర్ బస్తీ ప్రభుత్వ ఆసుపత్రిలో కోవిడ్ రూల్స్ పాటించకుండా ప్రెస్ మీట్ నిర్వహించారని భట్టి విక్రమార్కతోపాటు ఆరుగురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేయించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం.కేసు విచారణలో భాగంగా న్యాయమూర్తి ముందు హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.

# విమల దశదిన కార్యక్రమానికి హాజరై నివాళులు ఆర్పించిన కాంగ్రెస్ నాయకులు



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీ బొమ్మిడి శ్రీనివాస్ యాదవ్ మాతృమూర్తి కీర్తిశేషులు బొమ్మిడి విమల దశదిన కార్యక్రమం బుధవారం విశాఖపట్నంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ఆర్ టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, ఖమ్మం జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిలారు వెంకటరమణ, యంద్రతి మురళీకృష్ణ, తగరం నాగరాజు, శ్రీకాంత్ తదితరులు హాజరై, బొమ్మిడి విమల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకుంటూ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కీర్తిశేషులు బొమ్మిడి విమల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

# పార్టీ , విద్యార్థి సంఘం బాధ్యతల నుండి వి.వెంకటేష్ బహిష్కరణ : సి.వై పుల్లయ్య

**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా , సిపిఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కమిటీ సభ్యుడిగా ఉండి, ఇటీవల సంవత్సర కాలం లో ఉద్యమ నిర్మాణ , రాజకీయ పనిలో లేకుండా బాధ్యతా రహితంగా వున్నాడు. అలానే సమావేశాలు తన బాధ్యత లో వున్నవి చేయకపోగా, బాధ్యులు పిలిచిన సమావేశాలకు రాకుండా చాలా బాధ్యతా రహితంగా వ్యవహరించాడు. అంతే కాకుండా వ్యక్తిగతంగా సంఘం పేరు చెప్పి చందాలు వసూలు చేశాడు. ఆర్థిక అరాచకాలకు ,నిర్మాణ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా వంగూరి వెంకటేష్ ని అన్ని బాధ్యతలు నుండి బహిష్కరిస్తున్నామని, ఇకనుండి వి వెంకటేష్ కు పిడిఎస్ యు కు, మాస్ లైన్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నామని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరకాలంగా వి వెంకటేష్ వ్యక్తిగత పనుల సాకుతో , పూర్తి కాలం కార్యకర్త బాధ్యతలను నిర్వహించకుండా, అబద్దాలు చెపుతూ, పిడిఎస్ యు కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నాడని అయన తెలిపారు.తనను అనేక సార్లు సమావేశ పరచి,లోపాలను మార్చుకోమని గుర్తు చేశామని, అయినా తనలో మార్పు రాలేదని, ఇంకా నిర్మాణ తప్పిదాలకు, ఆర్థిక అరాచకాలకు పాల్పడుతూనే ఉన్నాడని, కనుక క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నాడని, వ్యక్తిగత బలహీనతలకు లోనైనాడని పిడిఎస్ యు నుండి బహిష్కరి స్తున్నామని, ఇకనుండి వి వెంకటేష్ కు మాస్ లైన్ పార్టీతో కానీ, విద్యార్థి సంఘం తో కానీ ఎలాంటి సంబంధం లేదనీ తెలియజేస్తున్నామనీ, విద్యాసంస్థల బాధ్యులు కూడా సహకరించవద్దని తెలియజేస్తున్నామనీ అయన తెలిపారు. ఇలాంటి వ్యక్తిగత, నిర్మాణ, రాజకీయ అవకాశ వాద రాజకీయాలను పార్టీ శ్రేణులు, ప్రజాస్వామిక వాదులు వ్యతిరేకించాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ తరుపున కోరుతున్నాం అని సి వై పుల్లయ్య తెలిపారు.

# సహకార బ్యాంకు ద్వారా రైతులకు రుణ సదుపాయం: పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** పాల్వంచ మండలంలోని రైతులకు కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ద్వారా రుణ సదుపాయం కల్పించనున్నారని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో పాలక వర్గం సభ్యులు, సహకార బ్యాంక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు దీర్ఘకాలిక రుణాలు (ఎల్.టి. లోన్స్) ఎకరానికి 5.00 లక్షల వరకు 10.5 శాతం వడ్డీపై ఇవ్వనున్నారని అన్నారు. దీర్ఘకాలిక రుణాలలో ట్రాక్టర్లు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి వాటికి ఇవ్వనున్నారన్నారు. మండలంలోని (రూరల్) రైతులకు 30.00 లక్షల రూపాయలు వరకు, గృహ నిర్మాణాలకు 11.00 శాతం వడ్డీపై రుణాలు ఇవ్వనున్నారని అన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల అన్నారు.ఈ సమావేశంలో డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ ఎ. స్వప్న, సూపర్వైజర్ ఎస్. పూర్ణచందర్ రావు, ఎఫ్.ఎల్.సి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్లు బుడిగం రామమోహన్ రావు, కనగాల నారాయణరావు, జరబన సీతారాంబాబు, చౌగాని పాపారావు, సొసైటీ సి.ఇ.ఓ. జి. లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారుపేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు, రాజ్యాంగ నిబంధనలకు అత్యున్నత ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ ఫిరాయింపుల విషయంలో ప్రజలే తగిన సమయంలో తమ తీర్పును వెల్లడిస్తారని డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.

# ఏదులాపురం మున్సిపాలిటీ సమస్యలపై కమిషనర్ కి ఉద్యోగ సంఘాల వినతి



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేయగా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన పిదప ఈ క్రింద తెలిపిన వాటిపై హామీ ఇవ్వడం జరిగింది. ప్రణాళికాబద్ధంగా రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస రెడ్డి సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దామని తెలిపారు. పారిశుధ్య పనులు రోజు విడిచి రోజు చేయిస్తానని, కుక్కల బెడదను నివారించుటకు కాంట్రాక్టర్ కు అప్పగిస్తున్నామని, పందులను కూడా విహరించకుండా చూస్తామని తెలిపారు. గతంలో ఉన్న మిషన్ భగీరథ పైపులను మరమ్మత్తు చేయించి పైపులు ఉన్నచోట నీటిని అందించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎదులాపురం చెరువును నింపి మంచినీళ్లు అందిస్తున్నామని తెలిపారు. రైతు బజార్ కి త్వరలో నిర్మాణం చేపడతామన్నారు. 9 చోట్ల పార్కులను, ఓపెన్ జిమ్ములను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ క్రాస్ రోడ్ నుండి కోదాడ క్రాస్ రోడ్ వరకు డివైడర్ ను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ కొరకు టెండర్లు వేయడం పూర్తి అయిందని తెలిపారు. సీసీ రోడ్లు డ్రైనేజీలకు సంబంధించి పాత కాంట్రాక్టర్లను తొలగించి కొత్తగా టెండర్లను ఆహ్వానించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయటం జరిగింది. దసరా సెలవులలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. లైబ్రరీని రోటరీ నగర్ నుంచి ఏదులాపురం నకు షిఫ్ట్ చేస్తున్నట్లు తెలిపారు. హామీ ఇచ్చిన కమిషనర్ కి ఉద్యోగ సంఘం నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు విజయ్, ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, ఉడుగు వెంకటేశ్వరరావు, శోభన్ బాబు, రాములు నాయక్, మల్లయ్య, సాయిబాబా ,దేవయ్య, పుల్లయ్య, వెంగళరావు, వీరన్న, లచ్చు నాయక్, లింగయ్య, కేశయ నాయక్, పి. వెంకటేశ్వరరావు, వెంకటరమణ, వెంకటరెడ్డి, వెంకట్ రాములు, మల్లికార్జున్, అమృ, రమేష్, శ్రీనివాస్, ఉస్మాన్ అలీ, రామ్మూర్తి, శివరావు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తి కావాలి : రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- **భద్రాచల దేవస్థానంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు, ప్రాకారాల నిర్మాణాల పరిశీలన**
- **సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉన్నతా ధికారులతో సమీక్ష**





**ఖమ్మం, భద్రాచలం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వచ్చే ఏడాది శ్రీరామనవమి నాటికి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాకారాలు, మాడ వీధుల పున:నిర్మాణ పనులు పూర్తి కావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం మహబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న లతో కలిసి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు. --- వర్షం కురుస్తున్నా పనుల పరిశీలన బుధవారం ఉదయం నుంచి భద్రాచలం పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నప్పటికీ ముందస్తు షెడ్యూల్ ప్రకారం మంత్రి పొంగులేటి దేవాలయం చేరుకున్నారు. దమ్మక్క అన్నదాన సత్రం నుంచి మెట్లదారి వరకు వర్షపు చినుకులు కురుస్తున్నా, బురదలోనే దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశలించారు. ఎట్టి పరిస్థితులోనూ జాప్యం నెలకొనొద్దని సూచనలు చేశారు. ఆ తర్వాత భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు.--- వంద శాతం పనులు పూర్తి చేయిస్తాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూ.300 కోట్ల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈనెల 4వ తేదీన పరిశీలించానని, మళ్లీ ఇప్పటివరకు జరిగిన పురోగతిని నేరుగా తెలుసుకునేందుకు వచ్చినట్లు వెల్లడించారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం పునఃనిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందేలా సకాలంలో పూర్తి చేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం

- **ఉచిత ఆయుర్వేద మెగా వైద్య శిబిరం విజయవంతం : ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు**





**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్యశాలల ఆధ్వర్యంలో ఉచిత "ఆయుర్వేద మెగా వైద్య శిబిరం" విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు బి.పి, షుగర్, కీళ్ల నొప్పులు, వాత రోగాలు తదితర ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ శిబిరానికి దాదాపు 436 మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ ప్రజలు ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ 'యోగా'ను దైనందిన జీవితంలో ఒక ముఖ్య భాగం చేసుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యులు డాక్టర్ కె. పద్మావతి (సీనియర్ మెడికల్ ఆఫీసర్ అండ్ నోడల్ ఆఫీసర్), డాక్టర్ వై. ఉపేందర్ (సీనియర్ మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డాక్టర్ బి. సుధాకర్ (మెడికల్ ఆఫీసర్ అండ్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్), డి.పి.ఎం. బాబూనాయక్ లతో పాటు ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది, యోగా ఇన్స్ట్రక్టర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మాజీ కౌన్సిలర్ జోగుపర్తి ప్రభాకర్ రావు కూడా పాల్గొని తమ సందేశాన్ని అందించారు. జోగుపర్తి వైద్య శిబిరం విజయవంతానికి ఎంతో సహకరించారని డాక్టర్ రామారావు వివరించారు.

# జిల్లా కమిటీని పక్కనపెట్టి ఏకపక్ష నిర్ణయాలా?అంతర్గత విభేదాలు, గ్రూపు రాజకీయాలపై భగ్గుమన్న పిడిఎస్ యు జిల్లా నాయకత్వం




**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** మాస్‌లైన్ పార్టీకి అనుబంధంగా పనిచేస్తున్న పిడిఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీలోని 23 మంది నాయకులు తమ బాధ్యతలకు, సిపిఐ(ఎం ఎల్) మాస్‌లైన్ పార్టీ సభ్యత్వానికి సామూహికంగా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. పిడిఎస్ యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ తో పాటు జిల్లా, నగర, డివిజన్ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు బుధవారం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.పిడిఎస్ యు నాయకత్వంలో సరైన మార్గదర్శకత్వం, సమన్వయం లేకపోవడంతో పాటు కార్యకర్తల పట్ల అప్రజాస్వామిక వైఖరి కొనసాగుతోందని వారు ఆరోపించారు. సంస్థాగత నిర్ణయాల్లో జిల్లా కమిటీ సభ్యుల అభిప్రాయాలు, కార్యకర్తల భిన్నాభిప్రాయాలు, సమగ్ర చర్చలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని పేర్కొన్నారు.ప్రస్తుతం సంస్థాగత అభివృద్ధి, ఉద్యమ విస్తరణ కంటే వ్యక్తిగత ధోరణులు, గ్రూపు రాజకీయాలు, అంతర్గత విభేదాలకు ప్రాధాన్యత పెరిగిందని వారు ఆరోపించారు. పిడిఎస్ యు ఖమ్మం జిల్లా కమిటీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పై కమిటీ స్థాయి నిర్ణయాలను "మెజారిటీ నిర్ణయం" పేరుతో అమలు చేయడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.విమర్శ, ఆత్మవిమర్శ, సామూహిక చర్చ, భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణ, కింది స్థాయి కమిటీల అభిప్రాయాలకు ప్రాధాన్యత వంటి ప్రజాస్వామ్య సంస్థాగత పద్ధతులకు తగిన స్థానం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ వంగూరి పట్ల జరిగిన సంస్థాగత వ్యవహారాలను వారు ఖండించారు. ఒక కార్యకర్తకు సంబంధించిన అంశాలను సమిష్టిగా చర్చించి పరిష్కరించాల్సిన సందర్భంలో వ్యక్తిగత ధోరణులు, గ్రూపు రాజకీయాలు, అంతర్గత విభేదాలకు ప్రాధాన్యత ఇవ్వడం సరైన సంస్థాగత పద్ధతి కాదని పేర్కొన్నారు. జార్జిరెడ్డి, జంపాల ప్రసాద్ వంటి ఉద్యమ నాయకుల స్ఫూర్తితో ప్రగతిశీల, అభ్యుదయ భావజాలంతో విద్యార్థి సమస్యలపై పనిచేస్తున్న తమను సంస్థలో అణచివేసే పరిస్థితులు ఏర్పడ్డాయని వారు ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగడం సాధ్యం కాదని, ఇకపై ప్రగతిశీల, అభ్యుదయ భావజాల విస్తరణ కోసం స్వతంత్రంగా ముందుకు సాగుతామని తెలిపారు.రాజీనామా చేసిన వారిలో పిడిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్, సహాయ కార్యదర్శులు సాదిక్ పాషా, యశ్వంత్, ఉపాధ్యక్షులు శశికిరణ్, వినయ్, జిల్లా కమిటీ సభ్యులు శిలార్ పాషా, హరిచంద్ర ప్రసాద్, సందీప్, సురేష్, నవీన్, అన్వేష్, కార్తీక్, వెంకటేష్, నిఖిల్, వెంకటేష్ వేల్పుల, విష్ణు, నిఖిల్, అశోక్, మహేష్, అశోక్, ఈశ్వర్, అసిఫ్ తదితరులు ఉన్నారు.తమ తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని వారు తెలిపారు.

## అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- **రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన**



**ఖమ్మం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు.

## ఖమ్మం ప్రకాష్ నగర్ చప్టా, రంగనాయకుల గుట్ట చప్టా కూల్చివేతలే నేటి మంచి నీటి ఎద్దడి

- **వినాయక నిమజ్జనాలకు కరువైన మున్నేరు : తోట రామారావు**
- **ప్రస్తుత పాలకుల అనాలోచిత ఆలోచనలే అంగరంగ వైభవంగా జరిగే వినాయక నిమజ్జనాలకు నీటి ఎద్దడి**
- **ప్రభుత్వం పరిశీలించిన దంసలాపురం చెరువు గణేష్ ఉత్సవ కమిటీలను నిరుత్సాహ పరుస్తున్న తీరు**
- **ప్రజా నాయకుడుగా పరిస్థితి పరిశీలించి ఎదులాపురం మున్సిపాలిటీ తీర్థాల చప్టా పరిశీలించి 15 అడుగుల లోతున్న ఈ ప్రాంతం నిమజ్జనానికి అనువైనదిగా అధికారులను మెప్పించి గణేష్ ఉత్సవ కమిటీలకు సమాచారం : తోటరామారావు**



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** కొన్ని సంవత్సరాలుగా నీటి ఎద్దడి లేని ప్రాంతంగా ఉన్న ఖమ్మం నగరం ప్రస్తుత పాలకుల అనాలోచిత ఆలోచనతో మంచి నీటికి కరువైన ప్రాంతంగా మారిందని ఖమ్మం బి. ఆర్. ఎస్. నాయకులు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు ప్రభుత్వ అధికారులపై మండిపడ్డారు. త్రీ టౌన్ ప్రాంతంలో నీటి నిల్వగా ఉన్న ప్రకాష్ నగర్ చప్టా రంగనాయకుల చప్టా తో ఎప్పుడూ ఖమ్మం మున్నేరూ నీటి ప్రవాహం కళ కళలాడుతూఉండేదని ఆ ప్రాంతంలోనే వినాయక నిమజ్జనం, బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగేయని కాని వాటి కూల్చివేతతో నేటి వినాయక నిమజ్జనానికి కూడా నీటి కరువు ఏర్పడిందని రామారావు తెలిపారు. ఈ ప్రాంతానికి దగ్గరగా ఉన్న మున్నేరులో నీరు లేకపోవడంతో అధికారులు సూచించిన దంసలాపురం చెరువు గణేష్ ఉత్సవ కమిటీలను నిరుత్సాహ పరుస్తున్నాయని, ఆ దిశగా ప్రజా ప్రతినిధిగా నిమజ్జన అనువైన ప్రాంత పరిశీలన దిశగా ఏదులాపురం మున్సిపాలిటీలో 15 అడుగులుగా ఉన్న తీర్థాల చప్టాను పరిశీలించి అధికారులకు వినతీ పత్రం ఇచ్చి అనుమతి తీసుకొని ఈ ప్రాంతం అణువైనదిగా ఉన్నదని అధికారులుతో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసే విధంగా మెప్పించి త్రీ టౌన్ ప్రాంత ఉత్సవ కమిటీలు ఈ ప్రాంతంలో నిమజ్జనం చేసుకునే విధంగా సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇప్పుడైనా అధికారులు రానున్న మహిళా భక్తుల అత్యంత ప్రీతి అయిన బతుకమ్మ సంబరాలను అయిన ప్రజలు భక్తిశ్రద్ధలతో కాల్వఒడ్డు మున్నేరు ప్రాంతంలోనే జరుపుకునేలా తగు ఏర్పాటు చేయాలని సూచించారు.

## సకల జనావళి కొలిచి, పూజించే దేవుడు గణేషుడు: డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

- **గణేష్ నిమజ్జనం సందర్భంగా జరిగిన శోభాయాత్రలో పాల్గొన్న కొత్వాల**





**ఖమ్మం, పాల్వంచ్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** సకల జనావళి కొలిచి, పూజించే దేవుడు గణేషుడు అని డిసిఎంఎస్ మాజీ చైర్మన్,రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా బుధవారం పాల్వంచలోని ప్రాంతాల్లో జరిగిన శోభాయాత్రలో కొత్వాల తో పాటు పాత పాల్వంచ 46 డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి పాల్గొని పూజలు చేశారు. పాత పాల్వంచలో జీడికె యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపులో పాల్గొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఆదిదేవుడు వినాయకుడు ఆశీస్సులు, అందరికీ ఉంటాయని అన్నారు.

**పాత పాల్వంచ గడియకట్టలో గణేషుని పూజల్లో పాల్గొన్న కొత్వాల**

పాత పాల్వంచ గడియకట్టలోని కోసూరి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన నవరాత్రి ఉత్సవాల మండపాన్ని కొత్వాల, విమలాదేవిలు సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదానం కార్యక్రమాల్లో కొత్వాల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

## దేవభక్తుని కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా నిమజ్జన వేడుకలు



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ఘనంగా గోపాలపురం నందు గణనాథుడు నిమజ్జనాలు నిర్వహించారు. ఎనిమిదో డివిజన్ గోపాలపురం నందు అంగరంగ వైభవంగా నిమజ్జనం వేడుకలు, దేవ భక్తుని కిషోర్ ఆధ్వర్యంలో నిమజ్జనం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు, భక్తి శ్రద్ధలతో మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

## చిమ్మపూడి చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు విడుదల

- **రైతుల్లో హర్షం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు**





**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** రఘునాథపాలెం మండలంలోని చిమ్మపూడి గ్రామ రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గ్రామంలోని చెరువుకు నీటిని విడుదల చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో చెరువుకు నీరు చేరడంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.చెరువులోకి సాగునీరు చేరడంతో పంటలకు అవసరమైన నీటి లభ్యత మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా చేపట్టిన ఈ చర్య పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నర్సిరెడ్డి మాట్లాడుతూ రైతుల సాగునీటి అవసరాలను గుర్తించి చెరువుకు నీటిని విడుదల చేయడం సంతోషకరమైన విషయమన్నారు. నీటి లభ్యతతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు తూము సత్యనారాయణ, కాసిని శ్రీనివాస్ రావు, షేక్ రహీం పాషా, దొంతు వెంకన్న, పొన్నం నాగయ్య తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## నిమజ్జనం వేడుకల్లో ఆకట్టుకున్న చిన్నారి భక్తి




**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల జి ఆర్ ఆర్ శ్రీనివాసంలో వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన నిమజ్జన వేడుకల్లో ఓ చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తలపై వినాయకుడి విగ్రహాన్ని ధరించి, ఎంతో భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారి చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాడు. వినాయకుడి విగ్రహాన్ని తలపై ఉంచుకుని చేతులతో జాగ్రత్తగా పట్టుకొని భక్తిభావంతో ముందుకు సాగుతున్న చిన్నారి దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. చిన్న వయసులోనే గణనాథుడిపై భక్తిని చాటుతూ నిమజ్జన వేడుకల్లో పాల్గొనడం పలువురిని ముచ్చటపరిచింది. ఈ సందర్భంగా అక్కడున్న భక్తులు చిన్నారిని అభినందిస్తూ ఫొటోలు తీసుకున్నారు.వినాయక నిమజ్జనానికి తరలివచ్చిన భక్తుల సందడితో పరిసర ప్రాంతాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తుల జయజయ ధ్వానాలు, డప్పు చప్పుళ్ల మధ్య చిన్నారి వినాయకుడిని తలపై ధరించి కనిపించడం నిమజ్జన వేడుకల్లో ప్రత్యేక దృశ్యంగా నిలిచింది. చిన్నారి భక్తికి సంబంధించిన ఈ దృశ్యం పలువురి మనసులను ఆకట్టుకుంది.

## వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించిన సుడా చైర్మన్ దంపతులు





**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం నగరంలోని రోటరీనగర్‌లో గల సుడా చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర వ్హించారు. బుధవారం నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నవరాత్రుల సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో భక్తులకు అల్పాహారం, భోజనం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం అర్చకులు చైర్మన్ దంపతులకు, ఆదిత్య రెసిడెన్సీ కమిటీ సభ్యులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య రెసిడెన్సీ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# 24 నుండి 26 వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు చివరి అవకాశం : జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి రవిబాబు

**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** 2026–27 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మొదటి సంవత్సరం చేరాలనుకునే విద్యార్థులకు రాష్ట్ర ఇంటర్ బోర్డు ఈ నెల 24 నుండి 26 వరకు చివరి అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుండి 26వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ ముగియనుండటంతో, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిజిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# గణనాథునికి ఘన వీడ్కోలు పలికిన ఫెడరేషన్ నాయకత్వం

- **చల్లటి చినుకుల్లో గణపతి నిమజ్జనం**
- **భక్తులకు పులిహోర, మంచినీటి పంపిణీ**



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** నగరం నలుమూలల, గత తొమ్మిది రోజులుగా పూజ ల ందుకున్న వినాయక విగ్రహాలు భక్తుల కోలాహలం మధ్య ధంసలాపురం నిమజ్జన ఘాట్‌కు చేరుకున్నాయి. చల్లటి చినుకులు పడుతున్నప్పటికీ భక్తులు ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.నిమజ్జనానికి తరలివచ్చిన భక్తులకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అలసిపోయిన భక్తులకు పులిహోర పంపిణీ చేయడంతో పాటు చల్లటి మంచినీటిని అందించారు. ఫెడరేషన్ నాయకుడు ఎస్వీ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పులిహోర ప్రసాద, మంచినీటి సేవలు అభినందనీయమని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు టి ఎస్ చక్రవర్తి అన్నారు.గణేష్ నిమజ్జన మహోత్సవాన్ని పురస్కరించుకుని ముస్తఫా నగర్ ప్రాంతంలో భక్తులకు ఉచిత పులిహోర ప్రసాదం, తాగునీరు అందించడం పుణ్యకార్యమని వారు పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలుకుతూ భక్తులకు సేవ చేయడం ఆధ్యాత్మికతతో పాటు మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందన్నారు. సేవా కార్యక్రమాలను చూసిన పలువురు భక్తులు ఫెడరేషన్ నాయకత్వాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానిపాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, సయ్యద్ అంజద్, పత్తి శ్రీనివాస్, నాయకులు వి. రోశి రెడ్డి, ఏ. మురళి, బి. రవి, ఖమ్మం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# దంసలాపురం, కొత్తగూడెం చెరువులో వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు





**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని సురక్షితంగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు దంసలాపురం, కొత్తగూడెం చెరువులో మున్సిపల్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. 1,300 వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మొత్తం 13 క్రేన్లను ఏర్పాటు చేశారు. వీటిలో 10 క్రేన్లను నిమజ్జన కార్యక్రమానికి వినియోగిస్తుండగా, మరో 3 క్రేన్లను సపోర్ట్‌గా అందుబాటులో ఉంచారు. అదనంగా ఒక రొటేటింగ్ క్రేన్‌తో పాటు ఒక పెద్ద ఎక్స్కవేటర్‌ను ఏర్పాటు చేశారు. నిమజ్జన ప్రాంతంలో 22 సీసీ కెమెరాలు, 350 లైట్లు ఏర్పాటు చేసి, ఎంట్రన్స్ నుంచి ఎగ్జిట్ వరకు తగినంత వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు మైక్ సిస్టమ్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.శానిటేషన్ నిర్వహణ కోసం మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించడంతో పాటు, ప్రతి షిఫ్ట్‌కు 10 ట్రాక్టర్ల చొప్పున అందుబాటులో ఉంచారు. నిమజ్జన కార్యక్రమంలో సహాయక చర్యల కోసం ఫిషరీస్ శాఖకు చెందిన 150 మంది సిబ్బందిని మూడు షిఫ్టుల్లో విధుల్లో నియమించారు. పోలీస్ సిబ్బంది పర్యవేక్షణలో నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంది.ఈ సందర్భంగా సీపీ సునీల్ దత్ , ట్రైనీ కలెక్టర్ పరాస్ కుమార్, మాజీ మేయర్ పి. నీరజ, సుడా చైర్మన్ పువ్వాళ దుర్గాప్రసాద్ తదితరులు, స్తంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. క్రేన్ల పనితీరు, కంట్రోల్ రూమ్ నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, లైటింగ్, శానిటేషన్, సిబ్బంది విధులు తదితర ఏర్పాట్లను పరిశీలించారు.వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో అధికారులు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దేశానికి వెలుగు బాట వీర శ్రీకాకుళం : సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, కేంద్ర, నాయకులు, సాదినేని వెంకటేశ్వరరావు, జేవి చలపతిరావు అవునూరి మధు



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకురాలు శ్రీకాకుళ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ పైల చంద్రక్క ఆరో వర్ధంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం జరిగిన సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. వీర శ్రీకాకుళం సాయుధ పోరాటంలో అమరులైన ఎందరో వీరుల్ని స్ఫూర్తిగా తీసుకొని చిన్నతనంలోనే ఉద్యమంలోకి వచ్చింది ఆనాటి నుండి చనిపోయే వరకు విప్లవ రాజకీయాలకు దృఢంగా కట్టుబడి, భూస్వామ్య పెత్తందారులకు, దొరలకు దోపిడీ దారులకు వ్యతిరేకంగా గిరిజనుల కూడగట్టి పోరాడింది ప్రజలను చైతన్యవంతం చేసింది. అనేక సంవత్సరాలు రహస్య జీవితం గడిపింది, తన బిడ్డను కూడా తెలిసినవారికి ఇచ్చి ఉద్యమంలో పని చేసింది. తన బిడ్డ ఎనిమిదో తరగతి చదివేంతవరకు చూడలేదు. ఉద్యమ క్రమంలో పోలీసు దాడులు నిర్బంధాలు ఎన్కౌంటర్ల నుండి తృటిలో తప్పించుకున్న ఘటనలు ఉన్నాయి. సహచరులు చనిపోయిన ఈ ధైర్యంతో ముందుకు సాగింది. పోలీస్ చెరలో చిక్కి 13 సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపింది. పెరోల్ పై బయటకు వచ్చి రహస్య పనులు చేస్తున్న క్రమంలో ఆయుధాలతో విక్రమ్ అన్నతో కలిసి మరల అరెస్టు అయింది. చిత్ర హింసలు అనుభవించింది, శ్రీకాకుళం గోదావరి లోయ ప్రతిఘటన పోరాట ప్రాంతాలలో తీవ్ర నిర్బంధకాలంలో ప్రజల మధ్య ఉండి పని చేసింది. ఈ దేశంలో శ్రామిక రాజ్యం రావాలని, వర్గ దోపిడీ రద్దుచేసి వర్గ రహిత సమాజం కోసం, అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం మార్క్సిజం లెనినిజం, మావో ఆలోచన విధాన వెలుగులో జీవితాంతం పోరాడింది నేటితరం వారి త్యాగాలను స్ఫూర్తి తీసుకొని పని చేసినప్పుడే ఆమెకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో , జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య నాయకులు, కే లక్ష్మీనారాయణ,ఎం గిరి ,ఐ వెంకన్న, సుదర్శన్, కిషన్, మోహన్ రావు శ్రీకాంత్,జాన్ రెడ్డి, క్రాంతి, ఉదయ్,విజయ్,భరత్ తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : పోలీస్ కమిషనర్





**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా పోలీస్ సిబ్బంది విధివిధానాలపై యంయంఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ కీలక సూచనలు చేశారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్, జనసమ్మర్ధం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్‌లో సమయానికి హాజరై విధులు చేపట్టాలన్నారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.విగ్రహాల ఊరేగింపులు నిర్దేశిత మార్గాల్లోనే సాగేలా చూడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలన్నారు.నిమజ్జన వాహనాలపై అధిక సంఖ్యలో వ్యక్తులు ఎక్కకుండా, ప్రమాదకరంగా ప్రయాణించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనే వారిపై, డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, బాణసంచా వంటి అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.నిమజ్జన కేంద్రాల వద్ద బారికేడింగ్, లైటింగ్, రక్షణ సిబ్బంది ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయో పరిశీలించాలని అధికారులకు సూచించారు. నీటిలోకి ఎవరూ ప్రమాదకరంగా వెళ్లకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే రెస్క్యూ, మెడికల్ సిబ్బందితో సమన్వయం చేయాలన్నారు. సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట మార్గనిర్దేశం చేస్తూ ప్రజల్లో విశ్వాసం పెరిగేలా విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకుంటే ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, అడిషనల్ డీసీపీ కుమారస్వామి, విజయ కుమార్, ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# హరిణి హత్య కేసు నిందితులను శిక్షించాలి

- **బాధిత కుటుంబానికి అండగా ఉంటాం**
- **నిందుతులపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి**
- **సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**





**ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** నర్సింగ్ విద్యార్థిని హరిణి హత్య కేసులోని నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన హరిణి ఖమ్మంలో నర్సింగ్ చదువుతూ ఇటీవల లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులోని బంధువుల ఇంటికి వచ్చి వెళ్లిన మరుసటి రోజే దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ సమాచారం తెలిసిన వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఆయన, మృతదేహాన్ని పరిశీలించి కన్నీరుమున్నీరవుతున్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు ఉన్న ఓ విద్యార్థిని ఇలా దారుణంగా హత్యకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. సమాజంలో మహిళలకు రక్షణ కరువవుతున్న ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. హరిణి కుటుంబానికి తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, ఉప సర్పంచ్ పాషా తదితరులు వున్నారు.

# భక్తులు, ఉత్సవ కమిటీల సహకారంతో నవరాత్రి ఉత్సవాలు విజయవంతం

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య

- నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు, పోలీసుల నిరంతర పర్యవేక్షణ
- భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లతో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు







**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, పోలీస్ శాఖకు సహకరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సమన్వయం, ఉత్సవ కమిటీల సహకారం, వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు.బుధవారం స్థానిక ముస్తఫానగర్ చౌరస్తా వద్ద గణేష్ నిమజ్జన శోభాయాత్రను పోలీస్ కమిషనర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రుల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.నిమజ్జనం కోసం ప్రత్యేక ఘాట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అవసరమైన మౌళిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు వివరించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు చురుగ్గా పాల్గొంటూ తమ సహకారం అందించారని అన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ సూచనలను పాటించిన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది, పోలీసుల నిరంతర పర్యవేక్షణ తో, గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునే వరకు అవసరమైన భద్రతా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాత్రంతా, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితులను పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు.శోభాయాత్రలో పాల్గొనే భక్తులు, నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు. శోభాయాత్రలో క్రమశిక్షణ పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి, చిన్నారులు, వృద్ధులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి, నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు సహకరించాలని వారు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ఉత్సవ కమిటీలు, భక్తులు అందించిన సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో వ్యవహరించడం ద్వారా సోదరభావం, సామాజిక సమైక్యతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ, మునిసిపల్ అధికారులు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.అనంతరం ధంసలాపురం చెరువు వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, శోభాయాత్ర నిర్వహణ, భద్రతా చర్యలను వారు స్వయంగా పర్యవేక్షించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ డోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ స్తంభాద్రి ఖమ్మం నగర స్వర్ణకార సంఘం లడ్డు లక్కీ డ్రా



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వినాయక చవితి సందర్భంగా స్వర్ణ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో నవరాత్రులు విశేషంగా పూజలు అందుకున్నారు. 33 కేజీల లడ్డు లక్కీ డ్రా లో విజేతగా నిలిచిన డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లడ్డు లక్కీ డ్రా లో విజేతగా నిలవడం నాకు ఎంతో ఆనందంగా గర్వంగా ఉంది. ఈ లక్కీ డ్రా ఎంతో చక్కగా నిర్వహించిన కమిటీ సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ అందరి సహకారం ఆశీస్సులు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ విజయాన్ని అందరితో పంచుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. గెలుపొందిన లడ్డును మేళ తాళాలతో నా ఇంటి వద్దకు పంపించిన కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న డాక్టర్ మల్లాది ప్రసాదరావు



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ పట్టణంలోని పి.ఎస్. ఫంక్షన్ హాల్లో భారత్ రక్తదాన్ సేవా మిషన్ కే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలకు చెందిన రక్తదాతలు, సామాజిక సేవకులు అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి ఈ కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 320 సార్లు రక్తదానం చేసిన సంపత్ కుమార్ పాల్గొన్నారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కురిమేటి నవీన్ చేతుల మీదుగా ప్రముఖ జర్నలిస్ట్ మరియు మదర్ సర్వీస్ సొసైటీ సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ మల్లాది ప్రసాదరావుకు ఉత్తమ సేవా పురస్కారం–2026 అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మల్లాది ప్రసాదరావు మాట్లాడుతూ, మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా దాతల సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉచిత మెడికల్ వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు, నిరాశ్రయులైన వృద్ధులు, వితంతువులకు వస్త్రదానం, వృద్ధాశ్రమాల్లో అన్నదానం వంటి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని చెప్పారు.అదేవిధంగా కోవిడ్ లాంటి విపత్కరమైన పరిస్థితుల్లో మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసి ప్రజలకు రక్షణ కల్పించామని తెలిపారు. సమాజంలో నిస్వార్థంగా, స్వచ్ఛందంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సేవకులు, సామాజిక కార్యకర్తలను ప్రోత్సహిస్తూ మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారుగా 800 మందికి పైగా అవార్డులు ప్రధానం చేసినట్లు వెల్లడించారు.అనేక సేవా కార్యక్రమాలతో పాటు నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం, నిరుపేద కుటుంబాలకు ఆపన్న హస్తం అందించడం వంటి పలు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని డాక్టర్ మల్లాది ప్రసాదరావు పేర్కొన్నారు.ప్రజలకు, నిరుపేదలకు, అవసరంలో ఉన్న వారికి అందిస్తున్న సేవలను గుర్తించి ఉత్తమ సేవా పురస్కారంతో సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. సేవా కార్యక్రమాలకు గుర్తింపు లభించడం మరింత సేవాస్ఫూర్తితో ముందుకు సాగేందుకు ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు.అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డాక్టర్ మల్లాది ప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క ప్రాణం కూడా రక్తం అందక కోల్పోకుండా యువత ముందుకు వచ్చి రక్తదాతలుగా మారాలని, అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు.సమాజ సేవ అనేది కేవలం కార్యక్రమాలకు పరిమితం కాకుండా, అవసరంలో ఉన్న సమయంలో ఒక మనిషికి మరో మనిషి అండగా నిలవడమే నిజమైన సేవ అని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా మరింత సేవాస్ఫూర్తితో ప్రజలకు, నిరుపేదలకు, అవసరంలో ఉన్న వారికి తన సేవలను కొనసాగిస్తానని డాక్టర్ మల్లాది ప్రసాదరావు తెలిపారు. అవార్డుతుకున్న సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థలు,జర్నలిస్టులు, పలువురు ప్రముఖులు తదితరులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

# ఖమ్మంలో కవిరాజ్ నగర్ లో హరివిల్లు అపార్ట్మెంట్లో ఘనంగా శ్రీ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు





**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** హరివిల్లు అపార్ట్మెంట్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన విశేష వేలంపాట విజేతలను ప్రకటించారు. హుండీ: రూ 59,000/– చీరాల జగన్ – త్రిపుర దంపతులు. లడ్డూ ప్రసాదం: రూ 21,500/–జొన్నలగడ్డ వెంకట బ్రహ్మం – కృష్ణకుమారి దంపతులు. దోవతి కండువా: రూ 7,100/– శంకర్ (సి ఐ) – స్వాతి దంపతులు. కలశం: రూ 6,800/– సింగిరికొండ రాంబాబు – కవిత లక్ష్మి దంపతులు. ఛత్రి (గొడుగు): రూ 6100కండిబడ్ల జగన్నాథరావు – అమృతవల్లి దంపతులు. భక్తి శ్రద్ధలతో వేలంపాటలో పాల్గొని విజయవంతం చేసిన విజేతలందరికీ హరివిల్లు అపార్ట్ మెంట్ గణేష్ ఉత్సవ కమిటీ తరపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు మీ కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని కోరారు. మధ్యాహ్నం నుండి గణేష్ నిమజ్జనానికి అపార్ట్మెంట్ వాసులందరూకలిసి వెళ్లి నిమజ్జనం చేశారు. ఇది ఇలా ఉండగా ఖమ్మం నగరంలో వినాయకుని నిమజ్జనానికి తీసుకువెళ్లన చిన్నారి బాలుడు.

# నేడు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించనున్న మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** తెలంగాణ థర్మల్ పవర్ స్టేషన్లలో జరుగుతున్న పరిణామాలపై నిజానిజాలు తేల్చేందుకు బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏర్పాటు చేసిన ఆరు బృందాలు గురువారం వివిధ పవర్ స్టేషన్లను సందర్శించనున్నాయి. ఇందులో భాగంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలోని బృందం మణుగూరు లోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను గురువారం ఉదయం సందర్శించనున్నారు. పవర్ స్టేషన్‌లోని పరిస్థితులను పరిశీలించి, వాస్తవాలను తెలుసుకోనున్నారు.

# గణనాథుడికి ప్రత్యేక పూజలు

## - మండపం నిర్వాహకులకు నిమజ్జన దుస్తుల పంపిణీ



**తార్నాక, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** తార్నాక స్ట్రీట్ నంబర్ 1లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ఆర్‌టీఏ సభ్యుడు సురేష్ లాల్ నెతికర్, కాంగ్రెస్ నాయకుడు కమలేష్ యాదవ్ తదితరులు హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మండపం నిర్వాహకులతో కలిసి సురేష్ లాల్ నెతికర్ గణపతిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే మండపం నిర్వాహకులకు నిమజ్జన దుస్తులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు సురేష్ లాల్ నెతికర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి, శ్రద్ధలతో కొనసాగుతున్నాయని, నిమజ్జన కార్యక్రమాన్ని కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మండపం నిర్వాహకులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# షేక్‌పేట ఓయూ కాలనీలో వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

## - రూ.5.10 లక్షలకు గణేష్ లడ్డూ వేలం.. దక్కించుకున్న శ్రీ బాల్‌రెడ్డి





**షేక్‌పేట, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** షేక్‌పేట ఓయూ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంపాటలో శ్రీ బాల్‌రెడ్డి రూ.5 లక్షల 10 వేల ధరకు లడ్డూను దక్కించుకున్నారు.ఉత్సవ ప్రాంగణాలను రంగురంగుల విద్యుత్ దీపాలు, ప్రత్యేక విద్యుత్ తోరణాలు, పుష్పాలంకరణలతో సుందరంగా అలంకరించారు. ఆకర్షణీయమైన బ్యాక్‌డ్రాప్‌లు, వివిధ రూపాల్లో కొలువుదీరిన గణనాథుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా తీర్థప్రసాద వితరణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డీజే పాటలు, తీన్మార్ నృత్యాలతో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.వినాయకుడికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఓయూ కాలనీ అధ్యక్షుడు రవి కుమార్, స్థానిక యువజన సంఘాల సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# బాల గణేష్ నిమజ్జన వేడుకల్లో డాక్టర్ వెంకన్న బాబుకు ఘన సన్మానం

- భక్తిశ్రద్ధలతో బాబా నగర్–2 బాల గణేష్ నిమజ్జనం
- యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి : డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు
- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి



**షాద్‌నగర్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** షాద్‌నగర్ పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గల బాబా నగర్–2 కాలనీలో బాల గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయిబాబా కాలనీ సమన్వయకర్త, సీనియర్ పాత్రికేయులు, సామాజికవేత్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడాలని అన్నారు. బాల గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న చిన్నారులు, యువతను ఆయన అభినందించారు.యువత కేవలం ఉత్సవాల నిర్వహణకే పరిమితం కాకుండా సమాజ సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజా సమస్యల పరిష్కారం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో యువత ముందుండాలని సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని, పర్యావరణానికి హాని కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని డాక్టర్ వెంకన్న బాబు కోరారు. భక్తి, సేవ, సామాజిక బాధ్యత కలిసినప్పుడే పండుగలకు మరింత అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాయిబాబా కాలనీ గౌరవాధ్యక్షుడు మంగ శంకర్ ఏ.ఎస్.ఎస్.జి., ప్రధాన కార్యదర్శి కిరణ్ (లడ్డు), గణేష్ సిద్ధార్థ, అబ్బు, బాల గణేష్ యూత్ మండలి సభ్యులు, నిర్వాహకులు, యువత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ రాజకీయాల్లో చంద్రప్రియ పేరు చుట్టూ చర్చ

- రాజకీయ కుటుంబ నేపథ్యం.. ప్రజా సేవతో పరిచయం
- ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై నియోజకవర్గంలో సాగుతున్న చర్చ
- యువతలో కొత్త నాయకత్వంపై ఆసక్తి





**వికారాబాద్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వికారాబాద్ నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం డాక్టర్ చంద్రప్రియ పేరు చర్చనీయాంశంగా మారింది. రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన ఆమె వైద్యురాలిగా కొనసాగుతూనే ప్రజా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుండటం చర్చకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇటీవల మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా 'మన చంద్ర ఫౌండేషన్'ను ప్రారంభించారు.మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ కుమార్తెగా చంద్రప్రియకు రాజకీయ కుటుంబ నేపథ్యం ఉంది. చంద్రశేఖర్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండటంతో పాటు వికారాబాద్ ప్రాంత ప్రజలతో ఆయనకు ఉన్న పరిచయం కూడా చంద్రప్రియ రాజకీయ ప్రవేశంపై జరుగుతున్న చర్చలో ప్రస్తావనకు వస్తోంది. తన రాజకీయ అనుభవాన్ని ప్రజా సేవతో కొనసాగించేందుకు కుమార్తె ముందుకు రావడం సంతోషంగా ఉందని చంద్రశేఖర్ ఇటీవల పేర్కొన్నారు.ప్రజా సమస్యలు, ఆరోగ్య పరమైన అవసరాల విషయంలో కూడా చంద్రప్రియ స్పందిస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని పరామర్శించి, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి.ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చంద్రప్రియ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగుతారనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అందువల్ల ఇది ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ చర్చగానే చూడాల్సి ఉంది.మరోవైపు యువతలో కొత్త తరహా నాయకత్వంపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో చంద్రప్రియకు యువత నుంచి మద్దతు లభించే అవకాశం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. వైద్యురాలిగా ఉన్న పరిచయం, ప్రజా సేవా కార్యక్రమాలు, రాజకీయ కుటుంబ నేపథ్యం కలిసి ఆమెకు రాజకీయంగా ఉపయోగపడతాయని కొందరు విశ్లేషిస్తున్నారు.రాబోయే రోజుల్లో ఆమె రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, ఏ రాజకీయ వేదిక ద్వారా ప్రజల్లోకి వస్తారు, ఎన్నికల బరిలో నిలుస్తారా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే వికారాబాద్ రాజకీయాల్లో డాక్టర్ చంద్రప్రియ పేరు చర్చలోకి రావడం మాత్రం ఆసక్తికర పరిణామంగా మారింది.

# సిరికొండలో వడ్డీ బాదుడు తీవ్ర ఇబ్బందుల్లో సామాన్యులు




**నిజామాబాద్ రూరల్ సిరికొండ , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** సిరికొండ మండలంలో వడ్డీ వ్యాపారుల దందా జోరుగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో డబ్బులు అవసరమైన సామాన్యులే లక్ష్యంగా ఐదు, పది రూపాయల చొప్పున అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు తీసుకునే సమయంలో తక్కువ మొత్తమే అనిపించినా, రోజులు గడిచేకొద్దీ వడ్డీ భారం పెరిగి అసలుకంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు వాపోతున్నారు. 5, 10 రూపాయల వడ్డీతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్న ఆరోపనలు వినిపిస్తున్నాయి చిట్టీలు.. అప్పులు.. మళ్లీ వడ్డీ వసూళ్లుమండలంలో కొంతమంది వడ్డీ వ్యాపారులు చిట్టీలు నిర్వహిస్తూ, చిట్టీలు ఎత్తిన వారికి డబ్బులు ఇవ్వడం, అనంతరం ఆ మొత్తాన్ని అధిక వడ్డీతో తిరిగి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకసారి అప్పు తీసుకున్న తర్వాత వడ్డీ చెల్లింపులు కొనసాగుతూనే ఉండటంతో కుటుంబాల నెలవారీ ఆదాయంలో గణనీయమైన భాగం అప్పులకే వెళ్తోందని బాధితులు చెబుతున్నారు. వడ్డీ కట్టడమే.. అసలు తీరేదెప్పుడు?అప్పు తీసుకున్న మొత్తానికి ఇప్పటికే పలుమార్లు వడ్డీ చెల్లించినా ఇంకా బకాయి ఉందంటూ డబ్బులు అడుగుతున్నారని మండలానికి చెందిన కొందరు బాధితులు తమ గోడు తమావరితో చెప్పుకుంటున్నారు కొందరు వ్యాపారులు ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు అడగడం, గడువు తేదీల పేరుతో ఒత్తిడి చేయడం వల్ల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీ కట్టడానికే మరోచోట అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల నిఘా అవసరంఅధిక వడ్డీ వసూళ్ల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు బయటకు వచ్చి ఫిర్యాదు చేయడానికి కూడా వెనుకాడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిట్టీలు, ప్రైవేట్ అప్పుల పేరుతో జరుగుతున్న వసూళ్లపై సంబంధిత అధికారులు దృష్టిసారించి, నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు. సామాన్యులను అప్పుల ఊబిలోకి నెట్టే వడ్డీ వ్యాపారాలపై నిఘా పెంచాలని బాధితుల కుటుంబాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# అవిఘ్నంగా సాగుతున్న 1700 కిలోమీటర్ల విశ్వకర్మ ఏక్తా యాత్రను విజయవంతం చేద్దాం..



**పటాన్ చేరు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** బీజేపీ సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ మరియు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం పటాన్చెరు నియోజకవర్గ అధ్యక్షులు కంజర్ల కృష్ణ మూర్తి చారి విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17వ తేదీన హైదరాబాద్ బోరబండలోని శ్రీ విశ్వకర్మ దేవాలయం నుంచి ప్రారంభమై 1700 కిలోమీటర్ల విశ్వకర్మ ఏక్తా యాత్ర సోమవారం ఐదవ రోజు నాడు రామాయంపేట నుండి కామారెడ్డి చేరుకున్నారు ఈ సందర్భంగా ఎక్తాయాత్రలో భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ కంజర్ల కృష్ణమూర్తిచారి, సునంద కృష్ణమూర్తి పాల్గొని ఈ యాత్ర దిగ్విజయంగా సాగాలని కోరుకున్నారు అదేవిధంగా యాత్ర దేశవ్యాప్తంగా విశ్వకర్మల ఐక్యత సాంస్కృతిక పూర్వవైభవం సామాజిక సాధికారత ఆర్థిక స్వావలంబన రాజకీయ పునరికి కరణే లక్ష్యంగా విశ్వకర్మను సెంటర్ చేపడుతున్న విశ్వకర్మ యుక్తాయాత్రకు కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ తరపున 11,111 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా కృష్ణ మూర్తి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా విశ్వకర్మలు వివిధ రాష్ట్రాల్లో వివిధ భాషలు, ప్రాంతాలు, పేర్లతో గుర్తించబడుతున్నప్పటికీ, వారందరి మూలం, వారసత్వం, వృత్తి నైపుణ్యం ఒక్కటేనన్నారు. ఈ విభిన్న గుర్తింపుల కారణంగా విశ్వకర్మ సమాజం ఒక సమగ్ర శక్తిగా తన ఉనికిని చాటుకోవడంలో కొంత వెనుకబడిందన్నారు.విశ్వకర్మలందరినీ ఒకే సామాజిక, సాంస్కృతిక గుర్తింపు కింద ఐక్యం చేయడం, సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంపొందించడం, తమ హక్కులు మరియు భవిష్యత్తుపై అవగాహన కల్పించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని తెలిపారు.విశ్వనాథుల పుష్పగిరి ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు వేయి కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించి విశ్వకర్మ సమాజంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యానికి బీజం వేశారని అన్నారు. విశ్వకర్మ సమాజ భవిష్యత్తు కోసం తనను తాను అంకితం చేసుకుని పనిచేస్తున్న పుష్పగిరి అడుగుజాడల్లో పార్టీలకు అతీతంగా విశ్వకర్మలు కలిసి నడవాల్సిన అవసరం ఉందన్నారు.74 రోజుల పాటు ఏడు రాష్ట్రాలను దాటుతూ హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు సాగే ఈ యాత్ర కేవలం పాదయాత్ర కాదని, దేశవ్యాప్తంగా విశ్వకర్మ సమాజాన్ని అనుసంధానించే ఒక చైతన్య యాత్ర అని ఆయన పేర్కొన్నారు.సంప్రదాయ వృత్తులు, కళలు, శిల్ప నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానంతో దేశ నిర్మాణంలో విశ్వకర్మలు శతాబ్దాలుగా అందించిన సేవలకు తగిన గుర్తింపు, గౌరవం లభించాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంప్రదాయ వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు కనుగొని, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఆర్థిక ప్రగతి మరియు ఆధునిక అవకాశాలతో విశ్వకర్మలను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా విశ్వకర్మ యువత ఈ యాత్రలో క్రియాశీలక పాత్ర పోషించాలని, గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు యువతను కన్వీనర్లు, సమన్వయకర్తలుగా ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా వంటి వేదికలను ఉపయోగించుకుని యాత్ర సందేశాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడంలో యువత కీలక పాత్ర పోషించాలని అన్నారు.ఈ యాత్ర ద్వారా విశ్వకర్మ సమాజం యొక్క ఐక్యత, ఆత్మగౌరవం, సాంస్కృతిక వారసత్వం, వృత్తి పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి మరియు రాజకీయ సాధికారత వంటి విస్తృత అంశాలపై జాతీయ స్థాయిలో చైతన్యం తీసుకురావాలని నాయకులు తెలిపారు.హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు సాగే ఈ చారిత్రాత్మక యాత్రకు దేశవ్యాప్తంగా ఉన్న విశ్వకర్మ నాయకులు, యువత, మహిళలు, వృత్తిదారులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు మరియు ప్రతి విశ్వకర్మ కుటుంబం తమవంతు సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు.

# 21వ వార్డు శ్రీమన్నారాయణ కాలనీలో ఘనంగా గణేష్ నిమజ్జనం





**సూర్యాపేట , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** 21వ వార్డు శ్రీమన్నారాయణ కాలనీలో గణేష్ నిమజ్జనోత్సవం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు.ఈ సందర్భంగా యువత, మహిళలు, చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. భక్తిగీతాలు, నృత్యాలతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం గణేష్ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తూ భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలోబచ్చు సైదారావు, వి శ్రీనివాస్ రెడ్డి,, విశ్వనాదుల సతీష్,ఎం రంగారావు శ్రీనివాసరావు,మల్లం రమేష్, వేమూరి సతీష్,, మార్కపుడి రామకృష్ణ,బాదే రామలింగయ్య, చల్లా ప్రవీణ్,ఆవుల శివప్రసాద్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# పలు వినాయక మండపాలను సందర్శించిన కృష్ణమూర్తి చారి..





**పటాన్ చేరు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వినాయక నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా బిజెపి సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్, కే కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ చైర్మన్ కంజర్ల కృష్ణమూర్తి వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎల్ఐజి భారతి నగర్ డివిజన్లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం రామచంద్రపురం వినాయక మండపాన్ని దర్శించుకోవటం జరిగింది , యేసయ్య హాస్పిటల్ రామాలయం దగ్గర రామసేన యూత్ వినాయక మండపాన్ని దర్శించుకుని వినాయకుని పూజల కొరకు చందా అందించారు, ఓల్డ్ ఎమ్ఐజి కాలనీలోని బజరంగ్ సేన యూత్ అసోసియేషన్ నిర్వహించిన వినాయక మండపాన్ని దర్శించుకుని అన్న ప్రసాదం కార్యక్రమాల కొరకు చెందాను అందజేశారు, ఎల్ఐజి భారతి నగర్ స్వామి వివేకానంద పార్క్ ఎదురుగా స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ వినాయక మండపాన్ని దర్శించుకుని అన్నదాన కార్యక్రమం కొరకు చందా అందజేశారు మరియు భారతి నగర్ విద్యుత్ నగర్ కాలనీలో బాల గణేష్ యూత్ నిర్వహించిన వినాయకుని దర్శించుకుని యువసేన సభ్యులకు అన్నసమారాధన కార్యక్రమం కొరకు చెందాను అందజేశారు, ఈ కార్యక్రమంలో సునంద కృష్ణమూర్తి, రాజేందర్ చారి, సుజాత, సాయి వెంకట హర్షా చారి, అనిత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కంజర్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ వినాయక నవరాత్రులను ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తున్న యూత్ అసోసియేషన్ సభ్యులను అభినందించి, ఆ వినాయకుని కృపా కటాక్షముల తో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నారు.

# రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



**సూర్యాపేట, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకున్న సలీం షరీఫ్‌ను చిలుకూరులోని సాయి గ్రామర్ స్కూల్ అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు మాట్లాడుతూ.. నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సలీం షరీఫ్ చేసిన కృషి అభినందనీయమని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్‌ను పెంచడంతో పాటు, ఎందరో ఉపాధ్యాయులకు బాసటగా నిలిచారని కొనియాడారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దీప్తి, ఉమ, లావణ్య, అరుణ, ఇందిర, అనూష, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని వద్ద మహా అన్నదాన కార్యక్రమం



**శేరి లింగంపల్లి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** శేరిలిగంపల్లి నియోజకవర్గం హఫీజ్ పెట్ డివిజన్ అంబేద్కర్ నగర్ లోని గణనాధుని దగ్గర అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్న దాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువ నాయకులు నిమ్మల దాత్రినాథ్ గౌడ్ విగ్నేశ్వరుని పూజలో పాల్గొని అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాలొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# సుబ్రహ్మణ్యం ల వేషధారణతో పత్తికుంట కు చేరుకున్న గణనాధుడు



**రాజేంద్ర నగర్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** తొమ్మిది రోజులు నిర్విఘ్నంగా పూజలందుకొని పదవరోజు నిమర్జనం కోసం ఎంతో చక్కగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులు సతీసమేతం గా గణపతి సుబ్రహ్మణ్యం ల వేషధారణతో పత్తికుంట కు తీసుకువచ్చిన గాయత్రీ స్కూల్ శివరాంపల్లి యాజమాన్యం కి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తరపున రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వై శ్రీధర్ డివిజన్ కన్వీనర్ జి బాబు లు ఘనంగా స్వాగతం పలకడం జరిగింది రాజేంద్రనగర్ ఏసిపి శ్రీనివాస్ మరియు ఆదిలాబాద్ సెకండ్ బెటాలియన్ నుండి బందోబస్త్ వచ్చిన అడిషనల్ కమిషనర్ జయప్రకాశ్ నారాయణ్ జి హెచ్ ఎం సి సిబ్బంది కూడా స్వాగతం పలికారు

# పార్థివదేహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**మంథని, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** మంథని మండలంలోని రచ్చపల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాదుల రాజేందర్ తండ్రి బుధవారం అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించడం జరిగింది. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జనగామ నర్సింగరావు, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి ఆరెల్లి కిరణ్, నాగరాజు, రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు: మండల ప్రజలకు ఎస్సై పి వి ఎన్ రావు సూచన




**పినపాక, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు సూచించారు. రైతులు, యువకులు, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దన్నారు. చిన్నారులు నీటి గుంటలు, చెరువులు, వాగుల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకవద్దని, వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. అనవసరంగా వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దన్నారు. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటే దాటే ప్రయత్నం చేయకుండా వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించి, అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా ఉండాలని కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు సూచించారు....

# బేకరిని సందర్శించిన వైరా ఎమ్మెల్యే .





**ఏన్కూర్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల కేంద్రంలోని ఏన్కూర్ కొత్తగూడెం రోడ్డులో కంభంపాటి శ్రీనివాస రావు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఎల్‌వీ బెంగళూరు అయ్యంగార్ బేకరిని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బేకరి నిర్వాహకులను ఆప్యాయంగా పలకరించి, వ్యాపార నిర్వహణ, అందిస్తున్న ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు.అనంతరం బేకరి నిర్వాహకులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఏన్కూర్ మండల కేంద్రంలో నూతనంగా బేకరి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం నాయక్, మాజీ ఎంపీటీసీ మేడ ధర్మారావు, జిల్లా సెక్రెటరీ సామెల్, గులాం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- **రెండు రోజుల పాటు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం.**
- **మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చి రామ్ నాయక్**



**ఏన్కూరు, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** మండల కేంద్రంలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా భారీ వర్షం పడటంతో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కారణంగా కొంతసేపు జనజీవనం స్తంభించింది.ఇదిలా ఉండగా, రానున్న రెండు రోజుల పాటు మండలంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏన్కూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గుగులోత్ లచ్చి రామ్ నాయక్ కోరారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, చెరువులు, వాగులు, కాలువల సమీపంలోకి వెళ్లవద్దని కోరారు.రైతులు కూడా వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప వర్షాల సమయంలో ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా డీసీసీ జనరల్ సెక్రటరీ తంబళ్ల సామేల్, మాజీ ఎంపీటీసీ మేడా ధర్మారావు, రేపల్లెవాడ ఉపసర్పంచ్ కాలంగి వీరభద్రం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిమ్మల నరేందర్ ,పంతగాని నరేష్ తదితరులు మండల ప్రజలకు వర్షాల నేపథ్యంలో పలు సూచనలు చేశారు. ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాంగ్రెస్ మండల నాయకులు కోరారు.

# రంగారెడ్డి జిల్లా ఉత్తమ విద్యాధికారికి ఘన సన్మానం

- **మంచాల మండలం ఎంఈఓ రాందాస్ కి దక్కిన గౌరవం.**



**ఇబ్రహీంపట్నం , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** మంచాల మండల కేంద్రంలోని రంగారెడ్డి జిల్లాస్థాయిలో ఉత్తమ మండల విద్యాధికారిగా ఎంపికైన మంచాల మండల విద్యాధికారి రాందాస్ కు టి.ఎస్. యు.టి.ఎఫ్.ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంచాల మండల విద్యా వనరుల కేంద్రం లో ఘనంగా సన్మానం చేయడం జరిగింది.టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ,జిల్లాఉత్తమ మండల విద్యాధికారి అవార్డు గ్రహీత రాందాస్ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే మహత్తర బాధ్యతను పాఠశాలల అభివృద్ధికి అంకితభావంతో నిరంతరం తన విధులను నిర్వహిస్తున్నారన్నారు. మంచాల మండలంలో విద్యా ప్రమాణాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారు. మంచాల మండల విద్యాధికారిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యారంగానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు "జిల్లా ఉత్తమ మండల విద్యాధికారిఅవార్డు" లభించడం రాందాస్ సార్ అకుంటిత కృషికి దక్కిన గౌరవంగా అయన అభి వర్ణించారు. రామ్ దాస్ మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన నుండి రంగారెడ్డి జిల్లాలో మంచాల మండలం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అగ్రగామిగా నిలిచిందని అన్నారు.రాందాస్ సార్ మండలం లోని పాఠశాలలయొక్క నిరంతర పర్యవేక్షణ మంచాల మండలంలో డ్రాపౌట్స్ ని తగ్గించడానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుంచాల మండల అధ్యక్షుడు డాక్టర్ అజ్మత్ ఖాన్ మండల ప్రధాన కార్యదర్శి తుల్జారామ్ ఉపాధ్యక్షుడు మండల యాదయ్య జిల్లా కౌన్సిలర్లు మోతిలాల్ వెంకట నరసయ్య సి.ఆర్. పి. జగదీష్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**మంథని/ పెద్దపల్లి, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంలోని గోదావరిఖని గోదావరి బ్రిడ్జి వద్ద వినాయక నిమర్జన ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,(స్థానిక సంస్థల అదనపు కలెక్టర్) జె. అరుణ శ్రీ తో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నిమజ్జన వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన భద్రతా , సౌకర్యాల ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన పాయింట్ల వద్ద మూడు షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి, నిమజ్జనం పూర్తయ్యే వరకు పరిశుభ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు.నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేర బ్యారికేడ్లు, క్రేన్లు, విద్యుత్ సరఫరా, తాగునీరు, లైటింగ్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి, నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లను, క్రేన్ల మరమ్మతులు చేసేందుకు మెకానిక్‌లను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఏసీపీ రమేష్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో చంద్రశేఖర్ ఆజాద్ క్రాంతి సంగ్ ఆధ్వర్యంలో 31వ గణేష్ నవరాత్రి ఉత్సవాలు





**వనస్థలిపురం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వనస్థలిపురం హిల్ కాలనీ పోస్ట్ ఆఫీస్ వద్ద చంద్రశేఖర్ ఆజాద్ క్రాంతి సంగ్ ఆధ్వర్యంలో 31వ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ప్రతి సంవత్సరం ఈ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను 31 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు కాలనీ వాసులందరిపై ఉండాలని నిర్వాహకులు తెలిపారు.ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అలాగే సరస్వతి పూజ, కుంకుమార్చన, పుష్పార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన, పుష్పార్చనలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారని పేర్కొన్నారు.ఈ నెల 25వ తేదీన నిమజ్జన కార్యక్రమం ఉంటుందని, ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వినోద్ తెలియజేశారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని పూజా కార్యక్రమాలు మొదటగా చేసి ఆ విఘ్నేశ్వరుని అనుగ్రహం పొందాలని, కేవలం పూజలే కాకుండా సమాజంలో మానవులంతా సమానత్వంతో, కులమతాలకు అతీతంగా బాలగంగాధర్ తిలక్ ప్రవేశపెట్టిన ఈ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు నేటి తరానికి ప్రత్యేకంగా నిలుస్తాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు విశ్వనాథ్ జాదవ్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు సూర్తి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి శశాంక్, కోశాధికారి సరోజ్, ఉపాధ్యక్షులు ఆకాష్, ఓం ప్రకాష్, శ్రీకర్, నిఖిల్, నాగరాజు, మరియు సభ్యులు సందీప్, ఆకాష్, చందు, శివ, సంగీత్, శ్రీరామ్, వివేక్, శ్రీకర్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ -2026లో పారదర్శకతతో కచ్చితంగా పరిశీలన జరగాలి.

- క్షేత్రస్థాయిలో ప్రక్రియను పరిశీలించిన సీఈవో సి. సుదర్శన్ రెడ్డి
- జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



పత్రికా ప్రకటన.

తేదీ: 23.09.2026.

**గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం మిగిలిన సీట్లకు నేరుగా ప్రవేశాలు.**

పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలురు మరియు బాలికలకు శుభవార్త. హైదరాబాద్ మరియు రంగారెడ్డి రీజియన్ పరిధిలోని మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్ మరియు సంగారెడ్డి జిల్లాల్లో ఉన్న గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం మిగిలిన సీట్లకు నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ శ్రీ కె. నాగార్జున రావు ఒక ప్రకటనలో తెలిపారు.

10వ తరగతి ఉత్తీర్ణులైన బాలురు మరియు బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. 24.09.2026, 25.09.2026 మరియు 26.09.2026 తేదీలలో సంబంధిత గిరిజన గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను నేరుగా సంప్రదించి, ఖాళీలు ఉన్న గ్రూపుల్లో మాత్రమే ప్రవేశం పొందవచ్చు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న గ్రూపులో ఖాళీ ఉందో లేదో ముందుగా సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. కళాశాలల వివరాలు

| క్రమ సంఖ్య | జిల్లా | కళాశాల పేరు | బాలురు/ బాలికలు | అందుబాటులో ఉన్న గ్రూపులు | ప్రిన్సిపాల్ మొబైల్ నంబర్ |
|---|---|---|---|---|---|
| 1 | రంగారెడ్డి | TGTWURJC (B), ఇబ్రహీంపట్నం | బాలురు | MPC, BiPC | 9490215948 |
| 2 | రంగారెడ్డి | TGTWURJC (B), కొత్తూరు | బాలురు | CEC, HEC | 8008883524 |
| 3 | రంగారెడ్డి | TGTWURJC (B), కందుకూరు | బాలురు | CEC, HEC | 9490233477 |
| 4 | వికారాబాద్ | TGTW RJC (B), కుల్కచర్ల | బాలురు | MPC, BiPC | 7799579659 |
| 5 | వికారాబాద్ | TGTWURJC (B), కొడంగల్ | బాలురు | MPC, BiPC | 9392859606 |
| 6 | వికారాబాద్ | TGTWURJC (G), తాండూర్ | బాలికలు | MPC, BiPC & MLT | 7989300047 |
| 7 | మేడ్చల్-మల్కాజిగిరి | TGTWURJC (G), జంగామెట్ | బాలికలు | MPC, BiPC | 9440829022 |
| 8 | సంగారెడ్డి | TGTWURJC (B), జిన్నారం | బాలురు | MPC, BiPC | 9849237238 |
| 9 | సంగారెడ్డి | TGTWURJC (B), నారాయణఖేడ్ | బాలురు | MPC, BiPC | 9948787987 |
| 10 | సంగారెడ్డి | TGTWURJC (B), కంగ్టి | బాలురు | CEC, HEC | 8500481205 |
| 11 | సంగారెడ్డి | TGTWURJC (G), జహీరాబాద్ | బాలికలు | MPC, BiPC | 9177942309 |
| 12 | సంగారెడ్డి | TGTWURJC (G), మునూర్, కరాసుల్లి | బాలికలు | MPC, BiPC | 8885609167 |
| 13 | సంగారెడ్డి | TGTWURJC (G), కల్హేర్, సిర్గాపూర్ | బాలికలు | MPC, BiPC | 9494315906 |

ఆసక్తి ఉన్న విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్ ద్వారా సంప్రదించి, ఖాళీల వివరాలు తెలుసుకొని, నిర్ణీత తేదీలలో కళాశాలకు హాజరై ప్రవేశం పొందవచ్చు.

సం/-
శ్రీ కె. నాగార్జున రావు
రీజినల్ కోఆర్డినేటర్ 23/9/2026






**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్–2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి నాగోల్ వార్డు కార్యాలయం, కుర్రి కాలనీ, శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్‌లను సందర్శించి క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల వివరాల పరిశీలన, పాత ఓటర్ల జాబితాలతో మ్యాపింగ్,వంటి కేటగిరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఈవో సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా అనవసరంగా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హులు, డూప్లికేట్ ఎంట్రీలు, చిరునామా మార్పులు తదితర అంశాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తు, అభ్యంతరం, నోటీసు, ఫైల్ డిస్పోజల్ వివరాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.అవసరమైన సందర్భాల్లో సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలు,వివరణలను నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ప్రతి బి ఎల్ ఓ, క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని ఓటర్ల వివరాలను బాధ్యతాయుతంగా పరిశీలించాలని సీఈవో తెలిపారు. డోర్–టు–డోర్ వెరిఫికేషన్, డాక్యుమెంట్ల పరిశీలన, డేటా ఎంట్రీ, మ్యాపింగ్ తదితర ప్రక్రియల్లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక లేదా క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశను సమర్థవంతంగా పూర్తి చేయాలని సీఈవో సూచించారు. నిర్దేశిత కాలపరిమితిలో ప్రక్రియను పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు.

ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎల్‌బీ నగర్ ఈ ఆర్ వో/జెడ్ సి వికాస్ మహతో, సంబంధిత ఎన్నికల అధికారులు, బి ఎల్ ఓ లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## తలకొండపల్లి ఎంఈఓ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల ధర్నా

- ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్
- మాదాయపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు: శివశంకర్




**తలకొండపల్లి, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం మాదాయపల్లి ప్రభుత్వ పాఠశాల నుండి ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై వేరే ప్రాంతానికి బదిలీ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు, డివైఎఫ్ఐ (DYFI) నాయకులు మండల విద్యాధికారి (MEO) కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ.. మాదాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 54 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. గతంలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా, ఇటీవల ఒకరిని డిప్యూటేషన్‌పై వేరే చోటికి పంపించడంతో పాఠశాలలో తీవ్ర విద్యాసంక్షోభం నెలకొందన్నారు. మిగిలిన ఇద్దరు ఉపాధ్యాయులతో 6 సబ్జెక్టులు బోధించడం సాధ్యం కాక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు మెరుగైన విద్య అందిస్తున్నామని గొప్పలు చెబుతూనే, మరోవైపు విద్యార్థులకు నష్టం చేకూర్చేలా వింత జీవోలను తీసుకువస్తోందని ఆయన విమర్శించారు. కేవలం మాదాయపల్లి మాత్రమే కాకుండా, జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఇదే తరహా పరిస్థితులు ఉన్నాయని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు.తమ సమస్యలపై ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చేందుకు రాగా,కార్యాలయంలో అధికారి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు, నాయకులు ఆఫీస్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. మాదాయపల్లి స్కూల్ నుండి పంపిన టీచర్‌ను వెంటనే తిరిగి అదే పాఠశాలలో కొనసాగించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు, మాదాయపల్లి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.3.15 లక్షలకు గణనాథుని లడ్డూ.. లక్కపురం రాజేందర్ రెడ్డికి సొంతం

**కేశంపేట, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలోని లింగంధన గ్రామ రచ్చబండ వద్ద శ్రీరామ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని మహాప్రసాదం లడ్డూ వేలం పాటను బుధవారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ వేలం పాటలో భక్తులు, గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన వేలంలో మదిలాపురం గ్రామానికి చెందిన లక్కపురం రాజేందర్ రెడ్డి అత్యధికంగా రూ.3 లక్షల 15 వేల రూపాయలు పాట పాడి గణనాథుని మహాప్రసాదం లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూ వేలం సందర్భంగా భక్తుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. అనంతరం నిర్వాహకులు రాజేందర్ రెడ్డిని అభినందించారు. గణనాథుని ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొని విజయవంతం చేశారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఉత్సవాల నిర్వహణకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## రాక్ టౌన్‌లో ఘనంగా 24వ గణపతి నవరాత్రుల ఉత్సవాలు



**నాగోల్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** రాక్ టౌన్ కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న 24వ గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.అలాగే ఈరోజు జరిగిన లడ్డూ ప్రసాదం వేలంలో రూ.3,05,000/–లకు శ్రీ ఇర్ల కోటి రెడ్డి శ్రీమతి ఇర్ల నిర్మలకుమార్తె ఇర్ల రుచిత కుమారుడు ఇర్ల మోహన్ కృష్ణ రెడ్డి దక్కించుకున్నారు.అలాగే గణపతి కలశాన్ని తుమ్మలపల్లి శ్రీకాంత్ రెడ్డి దంపతులు రూ.51,000/–లకు దక్కించుకున్నారు.వేలంలో పట్టు పంచలు, కొండువాలు, కరెన్సీ దండలు, రూ.10 నోట్ల దండలు, కాయిన్స్‌తో పాటు ఇతర వస్తువులను ఎర్ర లావణ్య మధుకర్, భీమ్ రెడ్డి, బొజ్జ వేణుగోపాల్ రెడ్డి, గోలి ఉమా సురేందర్ రెడ్డి, కడియాల పద్మా ఉమామహేశ్వర్ రెడ్డి, శిరీష–DKV శర్మ, కొంతం గోవర్దన్ రెడ్డి, దండు శ్రీధర్, నాగిరెడ్డి నరేందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మన్నే రవీందర్ రెడ్డి తదితరులు దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో రాక్ టౌన్ కమిటీ సభ్యులు మణిపాల్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సూర్యనారాయణ, రాంచంద్రా రెడ్డి, నవీన్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంపత్ కుమార్, ప్రతాప్ రెడ్డి, లింగా రెడ్డి, రాంరెడ్డి, మాధవ రెడ్డి, సత్తి రెడ్డి, కొండల్ రెడ్డి, సీతారాం రెడ్డి, మహేష్ రెడ్డి, నరేష్, సుదర్శన్ చారి తదితరులతో పాటు మహిళలు, చిన్నారులు, భక్తులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాక్ టౌన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి మాట్లాడుతూ, భక్తుల సహకారంతో 24వ గణపతి నవరాత్రుల ఉత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## ముద్దెంగూడలో బీఆర్ఎస్‌లో చేరికలు



**షాబాద్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** షాబాద్ మండలం ముద్దెంగూడ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పిటిసి పట్నం అవినాష్‌రెడ్డి సమక్షంలో కూర గోవర్దన్, భూపతి యాదయ్యతో పాటు పలువురు గ్రామ యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నూతనంగా పార్టీలోకి చేరిన వారికి పట్నం అవినాష్ రెడ్డి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారుఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన వారు బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్యాద నర్సింలు, మాజీ సర్పంచ్ జయమ్మ సుదర్శన్, ఉప సర్పంచ్ సిద్దపురం శివకుమార్, వార్డు సభ్యులు ఖాజా, సుమతమ్మ, మల్లేష్, కురువ సంఘం అధ్యక్షుడు చించేటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిఘా వైఫల్యంతో మార్వాడీ నగల వ్యాపారంపై ఆగ్రహం




**వికారాబాద్ , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: కష్టపడి కూడబెట్టిన డబ్బులతో ఆడబిడ్డ పెళ్లి కోసం బంగారు నగలు తయారు చేయించేందుకు ఇచ్చిన సొమ్ము, తాకట్టు పెట్టిన నగలు తిరిగి ఇవ్వకుండానే వ్యాపారి పరారయ్యాడని బాధితులు ఆరోపించారు. దీంతో ఓ కుటుంబంలో జరగాల్సిన వివాహం అర్ధాంతరంగా నిలిచిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.బాధితుల వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండల పరిధిలోని చాపలగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె వివాహం కోసం బంగారు నగలు తయారు చేయించేందుకు వ్యాపారికి రూ.4 లక్షలు చెల్లించాడు. అయితే నిర్ణీత సమయానికి నగలు సిద్ధం కాకపోవడంతో వివాహం నిలిచిపోయిందని తెలిపారు. అనంతరం నగలు లేదా తాను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని వ్యాపారిని కోరగా, వారం రోజుల్లో డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చాడని చెప్పారు.అయితే ఆ హామీ నెరవేర్చకుండానే రాత్రికి రాత్రే తాకట్టు పెట్టిన వస్తువులు, నగలతో వ్యాపారి పరారయ్యాడని బాధితులు ఆరోపించారు. కుల్కచర్ల మండలంలో గతంలోనూ ఇలాంటి ఘటనల్లో పలువురు వ్యాపారులు ప్రజలను మోసం చేసి వెళ్లిపోయారనే ఆరోపణలు ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు.ఈ ఘటనతో ఆగ్రహించిన ప్రజలు సంబంధిత నగల దుకాణాలను మూయించి, తమకు న్యాయం జరిగే వరకు వాటిని తెరవకూడదని డిమాండ్ చేశారు. ప్రజల నుంచి సొమ్ము, బంగారు నగలు సేకరించే వ్యాపారుల కార్యకలాపాలపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు. బాధితుల ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి, సొమ్ము మరియు నగలు తిరిగి ఇప్పించడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పినపాకలో వైభవంగా గణేష్ నిమజ్జన వేడుకలు..

- అన్నదానం, లడ్డు వేలంపాటలో భక్తుల ఉత్సాహం





**పినపాక, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం లోని వివిధ గ్రామాల్లో జరుపుకుంటున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు దాదాపు ముగింపు దశకు చేరుకోవడం జరిగింది. భక్తిశ్రద్ధలతో మహిళలు, యువతులు, యువకులు, గ్రామస్తుల సహాయ సహకారాలతో నవరాత్రులను భక్తిశ్రద్ధలతో, నిత్య పూజలతో, రంగురంగుల అలంకరణలతో, విశేష పూజలను గణనాథుడు అందుకోవడం జరిగింది. వేడుకలు తుది ఘట్టానికి చేరుకోవడంతో పినపాక మండల కేంద్రంలోని గణపతి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని తన్నీరు శ్రీనివాసరావు (కిరాణం) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో, ఉత్సవ కమిటీ నిర్వాహకుల సహకారంతో సుమారు 1000 మంది పైచిలుకు భక్తులకు గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.. అనంతరం నవరాత్రి పూజలు అందుకున్న పవిత్రమైన గణనాథుని లడ్డు ప్రసాదాన్ని వేలంపాట నిర్వహించగా.. పినపాక గ్రామానికి చెందిన వడియాల సునీల్ కుమార్ 35000/- రూపాయలకు, కలశాన్ని ఇదే గ్రామానికి చెందిన గోగిరెడ్డి సమ్మిరెడ్డి 42000/- రూపాయలకు సొంతం చేసుకున్నారు. అనంతరం నిర్వహించిన మహిళలకు మాత్రమే నిర్వహించిన లక్కీ డ్రా లో గెలుపొందిన విజేతలకు బహుమతులతో పాటు, పోటీలో పాల్గొన్న ఇతర మహిళలకు ప్రోత్సాహక బహుమతులను ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అన్నదానం చేయడం ద్వారా సమాజంలో సేవాభావం, ఐక్యత మరింత పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో సంకీర్త్ , ఆర్ ఐ శ్యాంసుందర్, స్థానిక సర్పంచ్ అరిగెల అలివేలు, రెవిన్యూ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ,ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు





**వికారాబాద్ , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వికారాబాద్: శారీరక లోపం జీవితంలో ఎదుగుదలకు అడ్డుకాదని, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని శాసన సభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వికలత్వ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా రూ.10 లక్షల నిధులతో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేకంగా సదరం శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వికలత్వ నిర్ధారణ పరీక్షలకు వచ్చే వారికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం ధ్రువపత్రం అందేలా చర్యలు తీసుకోవాలని, వైద్య సేవలు మెరుగ్గా అందించాలని వైద్యులకు సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన వసతులు, సిబ్బంది వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా పోలీసు అధికారి స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, సహాయ శిక్షణ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా అన్నదానం





**నాగోల్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నాగోల్ పరిధిలోని తట్టి అన్నారం గ్రామం శ్రీ లక్ష్మీ గణపతి కాలనీలో బుధవారం భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.కాలనీవాసుల సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 500 మంది భక్తులకు పైగా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా గణేశుని లడ్డూ వేలంపాటను నిర్వహించారు. ఈ వేలంపాటలో నారెడ్డి నరేంద్రరెడ్డి–పుష్పలత దంపతులు రూ.47,516లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. స్వామివారి వస్త్రాలను దిండి దివ్య నరేందర్‌రెడ్డి రూ.3,716లకు దక్కించుకున్నారు.వేలంపాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.నిమజ్జన వేడుకలకు ముఖ్యఅతిథిగా నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం అభినందనీయమన్నారు.ప్రజలు పరస్పర సహకారంతో పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.కాలనీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ..కాలనీవాసుల సహకారంతో ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసారి కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నదానం, పూజా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, జితేందర్‌గౌడ్, దుర్గాప్రసాద్, శ్రీలత, రాధిక, పుష్పలత, రజిని, కాలనీ కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు. కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఉత్సవాలను విజయవంతం చేసిన కాలనీవాసులకు నిర్వాహకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా నాగోల్‌లో ఘనంగా మెగా రక్తదాన శిబిరం



**నాగోల్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి 25 సంవత్సరాల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని, ఆయన జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా భారతీయ జనతా యువమోర్చా (BJYM) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నాగోల్‌లోని పిబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్ర రావు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోదీ గారి 25 సంవత్సరాల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి తమవంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీ చంద్రశేఖర్ తివారి జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శ్రీ ఎన్. గౌతమ్ జీ, శ్రీ తుళ్ల వీరేందర్ గౌడ్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ శ్రీ మల్కా కొమురయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి బండా కార్తీక రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి శ్రీ పోతుగంటి భరత్ ప్రసాద్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కుండే గణేష్, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు శ్రీ వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.హరీశ్వర్ రెడ్డి ,మల్కా యశస్వి ,యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సందీప్ గౌడ్ ,శరత్ చంద్ర ,మేడ్చల్ జిల్లా రూరల్ ఇన్‌చార్జి శ్రీ సామ రంగారెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీ పొట్లపల్లి సాయిరాం గౌడ్,యువమోర్చా రాష్ట్ర కార్యదర్శులు ,రాష్ట్ర పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా రంగారెడ్డి అర్బన్ జిల్లా రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి నాయకులు,పదాధికారులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ మోర్చాల నాయకులు, విద్యార్థులు, యువత, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి సేవా స్ఫూర్తిని చాటారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రజా సేవా ప్రస్థానానికి గుర్తుగా నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరం ద్వారా “సేవే సంకల్పం – సేవే సమాజానికి బలం” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం.

- ఏకదంతా... ఇక సెలవు.





**ఏన్కూర్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏన్కూరు మండల కేంద్రంలోని దాసరి కాలనీలోని చిన్న రామాలయం ఆలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండప వద్ద దాసరి కమిటీ ఆధ్వర్యంలో బుధవారంఅన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో పల్లి భాగ్య శ్రీ, మాజీ ఎంపీటీసీ మేడ ధర్మారావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గణనాథుడి కి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పల్లి భాగ్య శ్రీ మాట్లాడుతూ.... వినాయక కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమ ని కొనియాడారు. శ్రీ విఘ్నేశ్వరుడు ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజల కోరికలు నెరవేరాలని గణనాథుని పూజించారు. భక్తులు అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం గణేష్ నిమజ్జనోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు .తొమ్మిది రోజులపాటు భక్తుల చేత పూజలు అందుకున్న నిమజ్జనానికి తరలి వెళ్లడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దాసరి కమిటీ సభ్యులు భూదురి శేషయ్య, కొరివి సాంబశివరావు, అబ్బి మల్ల నాగేశ్వరరావు,ఎమ్మెస్ గోపాలరావు, అభిమాళ మహేష్,భరత్,ధర్మపురి నరేష్, మల్లు బిక్షం, సిద్ధం నాగేంద్రబాబు, సాయి భరద్వాజ తదితరులు పాల్గొన్నారు

# పితృవియోగంలో ఉన్న బీరం ను పరామర్శించిన తన్నీరు హరీష్ రావు

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**కర్నూలు , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పితృవియోగంతో విషాదంలో ఉన్న నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన హరీశ్‌రావు.. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బీరం హర్షవర్ధన్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు."కుటుంబానికి అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండాలి" పితృవియోగం తీరని లోటని, బీరం లక్ష్మారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, లక్ష్మారెడ్డి, మరి జనార్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొని బీరం హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. "బీరం లక్ష్మారెడ్డి మృతి కుటుంబానికే కాదు ఆత్మీయులకు తీరని లోటు" బీరం లక్ష్మారెడ్డి మృతికి పలువురు బీఆర్ఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా బీరం హర్షవర్ధన్‌రెడ్డికి, కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. పితృవియోగంలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఒకే వేదికపైకి రావడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వివిధ మండలాల సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఐ.టీ టవర్ ను సందర్శించిన కలెక్టర్





**నిజామాబాద్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐ.టీ టవర్ ను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు.ఐ.టీ టవర్ కేంద్రంగా కొనసాగుతున్న వివిధ కంపెనీల వివరాలను,వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం 13 కంపెనీలలో 380 మంది వరకు పని చేస్తున్నారని టీ.జీ.ఐ.ఐ.సీ జోనల్ మేనేజర్ శివ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా కంపెనీల నిర్వాహకులను,అందులో పని చేస్తున్న ఐ.టీ ఉద్యోగులను కలిసి స్థానికంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీయగా,వారు సంతృప్తి వ్యక్తం చేశారు.సాధ్యమైనంత మేరకు ఎక్కువ కంపెనీలు స్థానికంగా నెలకొల్పేలా చూడాలని,తద్వారా ఈ ప్రాంత యువతకు స్థానికంగా మరింత ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ సూచించారు.వినూత్న ఆలోచనలు,సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే స్టార్ట్ అప్ కంపెనీలకు ఐ.టీ టవర్ చక్కటి వేదికగా నిలుస్తుందని,దీనిని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.కలెక్టర్ వెంట టీ.జీ.ఐ.ఐ.సీ ఏ.ఈ శివకృష్ణ ఉన్నారు.

# చెరువుకట్ట బజార్‌లో ఘనంగా 'ఇరుముడి' సినిమా ప్రదర్శన

- ప్రత్యేక ప్రదర్శన..

**ఏన్కూర్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు రాత్రి చెరువు కట్ట బజార్‌లోని గణేష్ మండపం వద్ద 'ఇరుముడి' సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. గణనాథుడి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఈ సినిమా ప్రదర్శనకు భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.సినిమా ప్రదర్శనను వీక్షించేందుకు సాయంత్రం నుంచే భక్తులు మండపం వద్దకు చేరుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులతో ప్రాంగణం సందడిగా మారింది. చిన్నారులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సినిమా ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు.తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గణేష్ మండపం వద్ద భక్తి వాతావరణంతో పాటు సినిమా ప్రదర్శన సందర్భంగా ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంది.



# గృహప్రవేశానికి హాజరైన వైరా ఎమ్మెల్యే.



**ఏన్కూర్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచు పల్లి విద్యానగర్ కాలనీ రోడ్డు నెంబర్ 16 లో ఉన్నగ్రామీణ వైద్యుడు కొలి శెట్టి నరేష్ , రాజేశ్వరి దంపతులనూ తన గృహప్రవేశానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరయ్యారు.నరేష్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడి మండపాన్ని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయకుని తొమ్మిది రోజులు ఎంతో నిష్టతో భక్తి శ్రద్ధలతో పూజలు అందుకొని గంగమ్మ గుడి కి చేరుకుంటున్న వరసిద్ధి వినాయకుడికి భక్తితో వీడ్కోలు పలకాలని, అదేవిధంగా స్వామివారి ఆశీస్సులు అందరి పైన ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ భవేష్ మిశ్రా
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశం

**నిజామాబాద్, సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కోసం క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు.అక్టోబర్ 1వ తేదీ నుండి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు శ్రీకారం చుడతామని అన్నారు.ఈ నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా,అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లు ఎంపీడీఓలతో కీలక అంశాలపై సమీక్ష జరిపారు.ధాన్యం అమ్మకాల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ కార్యాచరణతో సన్నద్ధం కావాలని అన్నారు.కొనుగోలు కేంద్రాలలో సదుపాయాల కల్పనతో పాటు,రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గుర్తించిన గిడ్డంగులు,ఫంక్షన్ హాళ్లు,ఆయా ప్రదేశాలను క్షేత్ర స్థాయిలో సందర్శించాలని ఆదేశించారు.కాగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువు కంటే ముందే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు తప్పవని అన్నారు.మ్యాపింగ్ కాని వారికి,పేర్లు ఇతర వివరాలలో వ్యత్యాసం ఉన్న వారికి ఇంకనూ నోటీసులు జారీ చేయకపోతే తక్షణమే అందించాలని,నోటీసులు ఇచ్చిన వారి హియరింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.భూభారతి పెండింగ్ దరఖాస్తుల ప్రగతిని మండలాల వారీగా సమీక్షించిన కలెక్టర్,వచ్చే వారం నాటికి ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్ లో ఉండకుండా అన్నింటినీ పరిష్కరించాలని గడువు విధించారు.తహసిల్దార్,ఆర్డీఓ లాగిన్లలోని అన్ని మాడ్యుల్స్ కు సంబంధించిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ,భూభారతి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు.హౌసింగ్ శాఖ పనితీరును సమీక్షిస్తూ,మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ పెండింగ్ ఇళ్ళ నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా లబ్దిదారులను ప్రోత్సహించాలని అన్నారు.రెండవ విడత మంజూరీలను వేగవంతం చేయాలని సూచించారు.డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాలని అన్నారు.8274 డబుల్ బెడ్ రూమ్ లు పూర్తి కాగా,ఇప్పటికే వాటిలో 6713 ఇళ్ళ కేటాయింపులు పూర్తయ్యాయని,మిగిలిన 1561 ఇళ్ళను కూడా వారం వ్యవధిలో లబ్దిదారులకు లాటరీ పద్ధతిన,నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా కేటాయింపులు జరపాలని కలెక్టర్ ఆదేశించారు.





**మైనారిటీ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించాలి**

మైనారిటీల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు.మైనారిటీ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ అబ్దుల్ హమీద్ తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు.షాదీ ముబారక్ పథకం కింద జిల్లాకు 19.98 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం కేటాయించగా,7.79 కోట్లు మాత్రమే ఇప్పటివరకు పంపిణీ జరిగిందన్నారు.ఇతర సంక్షేమ పథకాల విషయంలోనూ ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని వివిధ పథకాల గురించి క్షేత్ర స్థాయిలో ముమ్మర ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.తద్వారా అర్హులైన ప్రతి ఒక్కరు పతకాలను సద్వినియోగం చేసుకునేలా,ప్రభుత్వ తోడ్పాటుతో లబ్ది పొందేలా చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు.లబ్దిదారుల ఎంపిక విషయంలోనూ అధికారులు జాప్యం చేయకుండా దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ అర్హత కలిగిన వారికి ఆమోదం తెలుపాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీ.ఆర్.ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,ఆర్డీఓలు రాజేంద్రకుమార్,విజయ కుమారి,డీ.ఆర్.డీ.ఓ సాయన్న,సంబంధిత శాఖల అధికారులు,అన్ని మండలాల తహసిల్దార్లు,ఎంపీడీఓలు,మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి 249వ డివిజన్ దయార్గూడలో ఘనంగా గణేష్ నిమజ్జనం








**కూకట్పల్లి , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** కూకట్‌పల్లి: 249వ డివిజన్ పరిధిలోని దయార్గూడ లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ముగిశాయి. ఉత్సవాల అనంతరం గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వినాయక విగ్రహాన్ని భక్తులు ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని "గణపతి బప్పా మోరియా" అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలతో దయార్గూడ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులు క్రమశిక్షణతో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.దయార్గూడ వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిమజ్జన కార్యక్రమం భక్తుల సందడితో ఉత్సాహభరితంగా సాగింది.

# ఆధ్యాత్మిక సేవలో శ్రీనివాస్ యాదవ్: వెల్జాల్ గణేష్ కమిటీలకు భారీ చందాలు





**వికారాబాద్, సెప్టెంబర్ 18, నేటి శుభోదయ :** వికారాబాద్: దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను కాపాడే దిశగా కీలక పరిణామమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నేపథ్యంలో ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్‌ను శాసనసభ స్పీకర్ తిరస్కరించిన విషయం తెలిసిందే. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించినట్లు ఆయన తెలిపారు.ప్రజలు ఏ పార్టీ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించారో, ఆ ప్రజా తీర్పును గౌరవించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. పార్టీ మార్పుల విషయంలో రాజ్యాంగం, చట్టం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్నామనే ధీమాతో నిబంధనలను ఉల్లంఘిస్తే న్యాయస్థానాలు అడ్డుకట్ట వేస్తాయని ఈ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొన్నారు.శాసనసభ స్పీకర్ వంటి రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నవారు తీసుకునే నిర్ణయాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా ఉండాలని ఆయన అన్నారు. దానం నాగేందర్ అనర్హత విషయంలో ఉన్నత న్యాయస్థానం తీర్పు స్పీకర్ నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తేలా చేసిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు, రాజ్యాంగ నిబంధనలకు అత్యున్నత ప్రాధాన్యత ఉంటుందని, పార్టీ ఫిరాయింపుల విషయంలో ప్రజలే తగిన సమయంలో తమ తీర్పును వెల్లడిస్తారని డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.

# ప్రశాంత గణేష్ నిమజ్జన శోభాయాత్రకై పోలీసుల మార్గదర్శకాలు: బాలానగర్ ఏసీపీ




**నేటి శుభోదయ కూకట్పల్లి సెప్టెంబర్ 23, 2026.** ఈ నెల 25వ తేదీన జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులు, మండప నిర్వాహకులు పలు ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని బాలానగర్ ఏసీపీ (ACP) పింగిలి నరేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా, ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముగిసేందుకు.. భద్రత, పౌర సదుపాయాల పర్యవేక్షణ కోసం సైబరాబాద్ పోలీస్ సుమారు 200 మందిపైగా పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు, నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని కోరారు.సైబరాబాద్ పోలీస్, సిఎంసీ, హైడ్రా, టిజిఎస్పీడీసీఎల్, జలమండలి సమన్వయంతో చేపట్టిన నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా ముగిసేందుకు, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా నిర్వాహకులకు పోలీసుల ముఖ్యమైన, కీలక మార్గదర్శకాలు చేశారు.మండపాల వద్ద నిర్వహించే అన్నదానాలు, లడ్డూ వేలం, ఇతర కార్యక్రమాలను వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలి. ఉదయం 10' గంటల నుంచి మధ్యాహ్నం 12' గంటల మధ్యలోనే శోభాయాత్రను ప్రారంభించి, ఆలస్యం చేయకుండా అధికారులు నిర్దేశించిన నిమజ్జన ప్రదేశానికి చేరుకోవాలన్నారు.విగ్రహాల తరలింపు మార్గంలో విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మలు లేదా ఇతర అడ్డంకులు ఉంటే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.శోభాయాత్రలో హైకోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డీజేల వినియోగం పూర్తిగా నిషేధం. ఎలాంటి నిబంధనల ఉల్లంఘన జరగకుండా నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించారు.విగ్రహాలను తరలించే వాహనాల కండిషన్‌ను, వాహన ఫిట్‌నెస్ ముందుగానే తనిఖీ చేసుకోవాలన్నారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అనుభవజ్ఞులైన డ్రైవర్లను మాత్రమే వాహనాలు నడిపేందుకు అనుమతించాలన్నారు.ప్రతి విగ్రహం వెంట బాధ్యత కలిగిన నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని. రహదారులపై అనవసరంగా వాహనాలు నిలిపివేయకుండా, సాధారణ ప్రజలకు, ఇతర వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.ప్రజల భద్రత కోసం, విస్తృతమైన అత్యవసర ప్రతిస్పందన చర్యలు చేపట్టబడ్డాయని. నీటిలో నిమజ్జన ప్రక్రియను సురక్షితంగా నిర్వహించడానికి, సైబరాబాద్ పోలీస్, హైడ్రా (HYDRAA) అన్ని ప్రధాన సరస్సుల వద్ద ప్రత్యేక నైపుణ్యం గల ఈతగాళ్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.నిమజ్జనం సమయంలో క్రేన్ కింద ఎవరూ నిలబడటం చేయకూడదు, చెరువులు లేదా ట్యాంక్‌లలోకి ఎవరూ నేరుగా దిగకూడదని సూచించారు. పూజా సామగ్రి, పూలను నీటిలోకి వెళ్లి వేయకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్త వహించాలన్నారు.నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రదేశంలో ఉండే పోలీసుల సూచనలను కచ్చితంగా పాటించాలని. 25న పెద్ద సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ మత సామరస్యానికి ప్రతీకగా, శాంతియుత వాతావరణంలో, బాధ్యతాయుతంగా వ్యవహరించి, పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏసీపీ విజ్ఞప్తి చేశారు.

# హనుమకొండలో సెప్టెంబర్ 26న పబ్లిక్ గార్డెన్లో జరిగే ప్రెస్ మీట్ ను విజయవంతం చేయండి



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి ప్రతినిధి సెప్టెంబర్ 23, నేటి శుభోదయ:** ధర్పల్లి మండల కేంద్రం లో వి బాలయ్య రాష్ట్ర అధ్యక్షులు సహారా బాధితుల సంక్షేమ సంఘం మాట్లాడుతూ దేశంలో 13 కోట్ల సహారా బాధితులకు రెండు లక్షల కోట్ల పై గా పేమెంట్లు చెల్లించాలని గత ఐదు సంవత్సరాల క్రితం నుంచి శాంతియుతంగా పోరాటాల నిర్వహిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నారు తప్ప పరిష్కార మార్గం చూపడంలో విఫలమైనారు పార్లమెంట్ ఎలక్షన్ ప్రచారంలో ప్రతి ఖాతాదానికి రూపాయి తో సహా చెల్లిస్తామని హామీలు ఇస్తూ ఓట్లు వేయించుకున్న తర్వాత హామీలు నీటి మూటలు గా మిగిలిపోతున్నాయి ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు కాలయాపన చేయడం వల్ల ఇప్పటికి దేశంలో సహారా ఇండియా తాతగారు 10 వేలకు పైగా చనిపోయారు వందలాది మంది ఏజెంట్లు సూసైడ్ ఎంతో మంది మానసిక పొంగిపోతూ గ్రామాల్లో ఖాతాదారుల ఒత్తిడికి తట్టుకోలేక గ్రామాలు వదిలి ఇతర రాష్ట్రాలకు బతుకుతెరువు కోసం వెళ్తున్నారు ఇప్పటికి ప్రభుత్వానికి ఎన్నో దుపలుగా వినతి పత్రాలు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టిన చెవిటి వారి ముందు శంకు దినట్లు ఉంది ప్రభుత్వ వ్యవహారం గత మూడు సంవత్సరాల క్రితం పోర్టల్ ఆన్లైన్ పేమెంట్ అని కేంద్ర హోం శాఖ మంత్రి అమితా షా ప్రారంభించి 40 నెలలు అవుతున్న ఇప్పటికీ కేవలం 9200 కోట్ల రూపాయలను మాత్రమే ఆన్లైన్ పేమెంట్ చేయడం జరిగింది ఇంకా ఇవ్వాల్సింది రెండు లక్షల కోట్ల పైగా బకాయిలు ఖాతాదారులకు రావాల్సిన డబ్బులు రానందున వారి పిల్లల పెళ్లిళ్లు చదువులు వైద్యం గృహ నిర్మాణాలు నిలిచిపోయాయి వారి యొక్క జీవితాలు అంధకారంగా తయారైనవి ఎన్నో ఆశలు పెట్టుకొని భవిష్యత్తులో పనికొస్తాయని పొదుపు చేసుకుంటే గద్దలాగా సహర సంస్థ నిండున కాతదారులను ముంచేసింది ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు సమన్వయంతో సహా ఇండియా ఆస్తుల్ని వేలం వేసి వచ్చిన డబ్బుల్ని యుద్ధ ప్రాతిపదికన చెల్లించి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నాం అని తెలిపారు.

# శ్రీరామనవమికి ముందే భద్రాచలం ఆలయ పనులు పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి.





**భద్రాద్రి కొత్తగూడెం , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను శ్రీరామనవమికి ముందే పూర్తి చేసేలా వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆలయాన్ని సందర్శించిన మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు.భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వం ఆలయ అభివృద్ధి పనులకు సుమారు రూ.275 కోట్ల నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం, మాడ వీధులు, అంతర్గత, బాహ్య ప్రాకారాల పనులను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.లిఫ్ట్ పనులను వేగవంతం చేసి ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాతి పనులకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, స్లాబ్ పనులను సమాంతరంగా కొనసాగించాలని సూచించారు. నిర్మాణ సామగ్రి, మానవ వనరుల కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఆలయ నిర్మాణంలో నాణ్యత, శాస్త్రోక్తత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్ట్‌లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# వెల్జాల్ లో వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

- **విఘ్నేశ్వరుని దర్శించుకున్న మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్, యువ నాయకుడు వానరాసి వెంకటేష్,**
- **వెల్జాల్ లో ప్రశాంతమైన వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు**







**తలకొండపల్లి , సెప్టెంబర్ 23, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలోని శ్రీ భవాని మాత ఆలయంలో నవరాత్రులు పూర్తి చేసుకున్న గణనాధునికి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు అభినందనలు తెలుపుతూన్నా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ బుధవారం గణనాధుని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు.వెల్జాల్ గ్రామానికి చెందిన నాగులపల్లి మురళి మోహన్ రావు బుధవారం మధ్యాహ్నం భక్తులకు భవాని మాత ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదం వితరణ చేయడం జరిగింది. అనంతరం సాయంత్రం గణనాధుని నిమజ్జన కార్యక్రమంలో వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ దాతలుగా ఆయిల్ ఆంజనేయులు, నీరడి జగన్, నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన విగ్రహ దాత రైల్వే డిపార్ట్మెంట్ ఆయిల్ ప్రసాద్ గౌడ్,మంగళవారం వెల్జాల్ గ్రామంలో ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో శ్రీ గణపతి నవరాత్రి .ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీ భవాని మాత ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.వెల్జాల్ గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందించేలా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాము, అనిల్, మల్లేష్, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.వెల్జాల్ గ్రామంలో శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మాజీ సభ్యుడు ముజేబుర్ రహేమాన్, మాజీ వార్ సభ్యుడు శివ విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ అంబాజీ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కూన రవి కుమార్, పి ఏ సి ఎస్ డైరెక్టర్ చర్ల వెంకట రెడ్డి,ఈనాడు రిపోర్టర్ విష్ణువర్ధన్, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, శ్రీ భవాని మాత ఉత్సవ కమిటీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన డీసీసీ అధ్యక్షురాలికి మధుసూదన్ రెడ్డి అభినందనలు

**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్23 నేటి శుభోదయ :** నూతనంగా రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా ఎన్నికైన పారిజాత నరసింహారెడ్డిని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డిని ఘనంగా అభినందించిన ఆయన ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాలో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డి మాట్లాడుతూ, తనకు డీసీసీ అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపైకి తీసుకు వచ్చి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, ప్రజా సమస్యలను గుర్తించి, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# బడా గణేష్ వద్ద గణపతి హోమం,అన్న ప్రసాద వితరణ

**షాబాద్ సెప్టెంబర్23 నేటి శుభోదయ;** షాబాద్ లో నూతనంగా నిర్మించిన గణేష్ మండపంలో ఏర్పాటు చేసిన బడా గణేష్ వద్ద బడా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణపతి హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ పంతులు ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని ,ప్రజలందరూ గణపతి ఉత్సవాల్లో పాల్గొని, ఆధ్యాత్మిక భావనతో పాటు ఐక్యతను చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు



# సేవామూర్తి మెడలో మరో మణిహారం

- నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డుకు కడవెండి శ్రీనివాస్ ఎంపిక
- మూడు దశాబ్దాల నిస్వార్థ సేవలకు దక్కిన అరుదైన గుర్తింపు

**ఖమ్మం ,సెప్టెంబర్ -23: నేటి శుభోదయ :** సమాజ సేవే ధ్యేయంగా మూడు దశాబ్దాలకు పైగా నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాల్లో ముందుండి, నిస్వార్థంగా సేవలందిస్తున్న కడవెండి శ్రీనివాస్కు ప్రతిష్ఠాత్మకమైన నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు లభించడం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.సమాజానికి తన వంతు బాధ్యతగా భావించి ఎన్నో సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న కడవెండి శ్రీనివాస్ సేవలను గుర్తించిన NMI ఫౌండేషన్, నోయిడా, ఉత్తరప్రదేశ్ సంస్థ ఆయనను ఈ ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ అవార్డు ఆయన సేవా ప్రస్థానానికి లభించిన అరుదైన గౌరవంగా పలువురు అభివర్ణించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కొదుమూరి జగన్నాథం మాట్లాడుతూ.. కడవెండి శ్రీనివాస్కు నరేంద్ర మోడీ నేషనల్ ఇన్స్పిరేషన్ అవార్డు రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. "సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వ్యక్తికి జాతీయ స్థాయి గుర్తింపు రావడం గర్వకారణం. సేవామూర్తి మెడలో మరో మణిహారం చేరింది" అని అన్నారు.కడవెండి శ్రీనివాస్ VCI ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్గా, VN Diamond KCGF శ్రేయోభిలాషిగా పలు సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్నారని తెలిపారు. ఎలాంటి స్వార్థ ప్రయోజనాలను ఆశించకుండా సమాజ సేవకు అంకితమై పనిచేయడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు."జేజేలు కడవెండి శ్రీనివాస్" అంటూ పలువురు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు ఆయనకు మాత్రమే కాకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ గర్వకారణమని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ కడవెండి విశ్వనాథం, రీజియన్ చైర్మన్ దాస శ్రీనివాసరావు, తేలుకుంట ధనంజయ, తేలుకుంట్ల ఓంకార్, చలవారి శ్రీనివాసరావు, సుగ్గల శ్రీహరి, మారేమళ్ళ రామకృష్ణ, కురివెళ్ల గోపాలకృష్ణ, డోకుపర్తి నాగేశ్వరరావు, పెనుగొండ సూర్యప్రకాష్ తదితరులు కడవెండి శ్రీనివాస్కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.మూడు దశాబ్దాల సేవకు జాతీయ స్థాయి గుర్తింపు దక్కడం.. కడవెండి శ్రీనివాస్ సేవా ప్రస్థానంలో మరో కీలక మైలురాయిగా నిలిచిందని వారు పేర్కొన్నారు.






# ముఖ్యమంత్రి సహాయ నిధిచెక్కుల పంపిణీ

**నిజామాబాద్ రూరల్ సిరికొండ నేటి శుభోదయ ప్రతినిధి సెప్టెంబర్ 23** సిరికొండ మండలంలో కొండాపూర్ గ్రామం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం రిలీఫ్ పండు ద్వారా మంజూరైన చెక్కులు బాధితులకు అందజేశారు డోన్పల్లి రాధా 48,500 ఆలకుంట పరమాలతో 8000 ముక్కెర సాయిలు 19500 మండే ఆశన్న 25000 విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ భర్త మానస శ్రీధర్ ఉప సర్పంచ్ రాజేశ్వర్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకుల జగన్ నల్ల బుచ్చన్న వాడే శేఖర్ గౌడ్ ఫారూఖ్ రైమ్ చంద్ర గౌడ్ వీరి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినది ఆపదలో ఉన్న ఆరోగ్య వైద్య ఖర్చులకోసం ఆర్థిక ఇబ్బందులు పడకూడదని నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి గారి కీ అలాగే డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి వీరి సహాయ సహకారాలు అందించినందుకు మా గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదములు



# సహారా ఖాతాదారుల గోడు వినండి.. బకాయిలు తక్షణమే చెల్లించండి

- స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు ఏజెంట్ల వినతి



**వికారాబాద్ 23 సెప్టెంబర్ నేటి శుభోదయ;** వికారాబాద్: సహారా సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ఖాతాదారులకు పెండింగ్‌లో ఉన్న సొమ్మును పూర్తి స్థాయిలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సహారా కార్యకర్తలు, ఏజెంట్లు బుధవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఖాతాదారులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని కోరారు.వికారాబాద్ శాఖతో పాటు హైదరాబాద్ పరిధిలోని సహారా సంస్థల్లో పలువురు ప్రజలు తమ పొదుపు సొమ్మును పెట్టుబడులుగా పెట్టారని తెలిపారు. అయితే పెట్టుబడులు గడువు ముగిసినప్పటికీ చాలామంది ఖాతాదారులకు పూర్తి మొత్తం అందకపోవడంతో వారు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం సహారా వాపసు పోర్టల్ ద్వారా అర్హత కలిగిన ఖాతాదారులకు సొమ్ము తిరిగి చెల్లించే ప్రక్రియ కొనసాగిస్తున్నప్పటికీ, కొంత మందికి ఇప్పటికీ పూర్తి మొత్తం అందలేదని తెలిపారు. ముఖ్యంగా మూడేళ్లకు పైగా తమ సొమ్ము కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు.ఖాతాదారులతో పాటు సహారా సంస్థల ఏజెంట్లు కూడా చెల్లింపుల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేసి ఖాతాదారులకు వారి సొమ్ము అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. ఖాతాదారుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పీకర్ హామీ ఇచ్చినట్లు ఏజెంట్లు తెలిపారు.

# భద్రాచలం ఇసుక రీచ్ సమీపంలో 3.5 కేజీల ఎండు గంజాయి పట్టివేత.

- ఇద్దరు వ్యక్తుల అరెస్ట్.. ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 23,(నేటి శుభోదయ);** భద్రాచలంలోని ఇసుక రీచ్ సమీపంలో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 3.5 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం వస్తువుల విలువ సుమారు రూ.2.80 లక్షలుగా అధికారులు తెలిపారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆర్. కిషన్ ఆదేశాల మేరకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్. నరేందర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ సీహెచ్. శ్రీహరి రావు, సిబ్బంది బుధవారం భద్రాచలం ఇసుక రీచ్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న యమహా ఎం టి ద్విచక్ర వాహనం (రిజిస్ట్రేషన్ నంబర్: టి జి 05 ఎఫ్ 3115 )ను ఆపి తనిఖీ చేయగా 3.5 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. నల్గొండ జిల్లా చిట్యాలకు చెందిన మస్కె మున్నా (తండ్రి మల్లయ్య), జున్ను శ్రీనివాస్ (తండ్రి నరసింహ)లు మారేడుమిల్లి నుంచి ఘట్‌కేసర్‌కు గంజాయిని తరలిస్తున్న సమయంలో పట్టుబడినట్లు అధికారులు తెలిపారు.పట్టుబడిన ఇద్దరు నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్ఫ◌ోన్లను తదుపరి విచారణ నిమిత్తం భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.ఈ తనిఖీల్లో ట్రైనింగ్ ఎస్ఐలు సందీప్, పృథ్వీ, కానిస్టేబుళ్లు వీరబాబు, ప్రసన్న కుమార్, డ్రైవర్ సాయి పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620